

తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి


సంపుటి : 21 | సంచిక : 45 | 9.11.2026 నుంచి 15.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |








ప్రాదేశిక పోరులోనూ కూటమి దూకుడు



అమరావతి: గత సార్వత్రిక ఎన్నికల్లో వైకాపాను ఓడించాలన్న ఏకైక లక్ష్యంతో ఓట్లేసిన జనం.. రెండున్నరేళ్ల తర్వాత కూడా అదే వ్యతిరేకతను కొనసాగిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లోనే కాదు.. గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా వైకాపాను విశ్వసించడం లేదు. మొన్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజానీకం వైకాపాను చావుదెబ్బ కొడితే.. ఇప్పుడు పరిషత్ ఎన్నికల్లో గ్రామీణ ప్రజలూ ఆ పార్టీని ఊడ్చేశారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయానికి వెలువడిన జడ్పీటీసీ ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 శాతం సీట్లకే వైకాపా పరిమితమవడం ఆ పార్టీ పట్ల ప్రజల్లో గూడు కట్టుకున్న వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఎంపీటీసీల్లోనూ 20 శాతంలోపే గెలిచింది. పార్టీ అధినేత జగన్ సొంత జిల్లా వైఎస్సార్ కడపలోనూ జనం 'ఓటు'తో వైకాపాను గింగిరాలు తిప్పేశారు. జిల్లాలో మొత్తం 39 జడ్పీటీసీ స్థానాల్లో వైకాపా గెలిచింది రెండంటే రెండు అదీ పులివెందుల నియోజకవర్గ పరిధిలోనివే. ఈ జిల్లా ప్రజలు 'ఓటు'తో ఎదురు తిరిగిన వైనం చూస్తే.. వైఎస్ కుటుంబం పట్ల వారిలో ఇన్నాళ్లూ వేళ్లూనుకున్న భయం పటాపంచలైనట్లే కనిపిస్తోంది. ఉమ్మడి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతోపాటు పల్నాడు ప్రాంతం తమకు పెట్టని కోటలని వైకాపా నాయకులు చెబుతుంటారు. ఆ జిల్లాల్లోనూ ఇప్పుడు వైకాపా ఘోరంగా దెబ్బతింది. 2021లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 54 జడ్పీటీసీ స్థానాల్లో 53లో ఎన్నిక జరిగితే ఏకగ్రీవంగా కొన్ని, దౌర్జన్యంగా మిగిలినవి వైకాపా చేజిక్కించుకుంది. ఇప్పటికీ పల్నాడు జిల్లాలో ఆ పార్టీ అరాచకం కొనసాగుతూనే ఉంది. కానీ పరిషత్ ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో ఒక్కటంటే ఒక్క జడ్పీటీసీ స్థానాన్ని కూడా వైకాపా గెలవలేకపోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొంతమేర ఉనికిని చాటుకునే ప్రయత్నం మాత్రమే చేయగలిగింది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనూ వైకాపా తేలిపోయింది. వైకాపా హయాంలో నంబర్-2గా చక్రం తిప్పడమే గాక ఉమ్మడి చిత్తూరు జిల్లాను శాసించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సొంత నియోజకవర్గం పుంగనూరులో కూడా అటు మున్సిపల్, ఇటు పరిషత్ ఎన్నికల్లో చేతులెత్తేశారు. వైకాపా ఐదేళ్ల అరాచక పాలనలో స్థానిక సంస్థల్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీలకు 14, 15 ఆర్థిక సంఘాల నుంచి వచ్చిన నిధులు రూ.2,100 కోట్లు దారి మళ్లించింది. వాటికి ఆర్థిక వెసులుబాటు లేకుండా చేసి, అభివృద్ధిని గాలికొదిలేసి ప్రజల్ని నానా ఇబ్బందులకూ గురిచేసింది. రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణకూ నిధుల్లేక స్థానిక సంస్థలు కునారిల్లాయి. కనీసం బ్లీచింగ్ కొనేందుకూ డబ్బుల్లేక సర్పంచ్‌లు రోడ్డెక్కారు. అవన్నీ గుర్తు పెట్టుకున్న ప్రజలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీని దరిచేరనివ్వలేదని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.



బ్యాలెట్ బాక్స్‌లో అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి సమస్య

పల్నాడు జిల్లా నరసరావుపేట ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. సత్తెనపల్లి మండలం కంకాణలపల్లి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లతో పాటు కరపత్రాలను కౌంటింగ్ సిబ్బంది గుర్తించారు. గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వే గేటు వద్ద యూ అకారం అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి వద్దంటూ అందులో విన్నవించారు. అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి యూ ఆకారంలో నిర్మిస్తే ఇబ్బంది పడతామని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రధాన రహదారికి బ్రిడ్జిని అనుసంధానం చేసేలా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

నిన్న మరణం.. నేడు విజేత

కౌంటింగ్‌కు ముందే గుండెపోటుతో కన్నుమూసిన జనసేన అభ్యర్థికి ఎన్నికల ఫలితాల్లో విజయం వరించింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతుని గూడెం గ్రామానికి చెందిన గారపాటి దివ్య (28) జనసేన పార్టీ తరఫున ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కావడానికి ముందే ఆమె గుండెపోటుతో మరణించారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో దివ్య విజయం సాధించినట్లు వెల్లడైంది. వైసీపీ అభ్యర్థిపై 352 ఓట్ల మెజారిటీతో ఆమె గెలుపొందారు. ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ ఆ ఆనందాన్ని ఆస్వాదించడానికి దివ్య లేకపోవడం గ్రామస్థులను కలచివేస్తోంది. గెలుపు వార్త తెలిసిన తర్వాత గ్రామంలో ఆనందం కంటే విషాదమే ఎక్కువగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి.. ఫలితాలు వెలువడే సమయానికి లేకపోవడం స్థానికులను తీవ్రంగా బాధిస్తోంది. దివ్యకు ప్రేమ వివాహం కాగా, ఆమెకు ఐదేళ్లు, మూడు నెలల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం, ఇద్దరు చిన్నారులకు తల్లి దూరం కావడం కుటుంబ సభ్యులను, గ్రామస్థులను మరింత విషాదంలోకి నెట్టింది. ఎన్నికల్లో గెలుపు సాధించినా.. ఆ విజయాన్ని కళ్లారా చూసుకోలేకపోయిన దివ్య ఉదంతం విషాదాన్ని నింపింది. ఫలితాల్లో గెలిచిన అభ్యర్థి పేరు ప్రకటించినా.. ఆ విజయాన్ని పంచుకోవడానికి ఆమె లేకపోవడం స్థానికులను కన్నీటి పర్యంతం చేస్తోంది.

రుషికొండ సముద్ర తీరానికి హోవర్ క్రాఫ్ట్‌లు

విశాఖపట్నం : విశాఖ సముద్ర తీరంలో హోవర్ క్రాఫ్ట్‌లు సందడి చేశాయి. వీటిని తిలకించేందుకు రుషికొండకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోస్టుగార్డుల విధుల నిమిత్తం గోవా నుంచి పశ్చిమ బెంగాల్‌కు వెళ్తున్న రెండు అధునాతన రక్షణ హోవర్ క్రాఫ్ట్‌లు ప్రతికూల వాతావరణం, తుపాను గాలుల కారణంగా తీరం వెంబడి ఆగుతూ ప్రయాణిస్తున్నాయని రుషికొండ మెరైన్ సీఐ కె.అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. ప్రయాణంలో భాగంగా కేవలం ఇంధనం నింపుకొనే నిమిత్తమే వీటిని తాత్కాలికంగా విశాఖ నగరంలోని రుషికొండ సముద్రతీరానికి తీసుకొచ్చారన్నారు. శుక్రవారం ఉదయాన్నే పశ్చిమ బెంగాల్‌కు బయలుదేరతాయని వివరించారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో అక్రమ రవాణాను అడ్డుకోవడానికి అత్యంత పటిష్ఠ నిఘా కోసమే వీటిని ఉపయోగిస్తారని తెలిపారు. ఇవి నీటిపైనే కాకుండా ఇసుకలో కూడా సునాయాసనంగా దూసుకుపోవడాన్ని ప్రత్యక్షంగా చూసిన పర్యాటకులు ఆశ్చర్యానికి గురయ్యారు.

మురసు తుపాను నష్టం రూ.1,918 కోట్లు!

అమరావతి: మురసు తుపాను ప్రభావంతో రూ.1,918 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. మురసు తుపాను నష్టాలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మురసు తుపాను నష్టంపై సమగ్రనివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని అధికారులను ఆదేశిం చారు. తుపాను కారణంగా రాష్ట్రానికి రూ.1,918.55 కోట్ల మేర ప్రాథమిక నష్టం వాటిల్లిందని అధికారులు సీఎంకు తెలిపారు. 3,57,805 ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులపై ప్రభావం పడిందని వివరించారు. ఉద్యానవన పంటలు 16,872 ఎకరాల్లో దెబ్బతినగా, 12,586 మంది రైతులు ప్రభావితమయ్యారని వెల్లడించారు. నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు 48-72 గంటల సమయం అవసరమన్నారు. ఆర్ అండ్ బీ పరిధిలో రాష్ట్ర, జిల్లా రహదారులు 760.10 కిలో మీటర్ల వరకు దెబ్బతిన్నా యని తెలిపారు.

వాట్సాప్‌లో దరఖాస్తు.. భద్రతకు ఎవరిది బాధ్యత?

సత్తెనపల్లి న్యూస్ : : దీపావళి వేళ బాణసంచా వ్యాపారానికి తెరలేవకముందే అనుమతుల సందడి మొదలైంది. తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు పోటీపడుతున్నారు. గతంలో అనుమతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండగా.. ఈసారి వాట్సాప్ గవర్నెన్స్ ఆ కష్టాలకు తెరదించింది. చేతిలోని సెల్‌ఫోన్‌తోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించడంతో దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. అయితే దరఖాస్తు విధానం సులభమైనంత మాత్రాన ప్రమాదకరమైన బాణసంచా విక్రయాల విషయంలో భద్రతా ప్రమాణాలు కూడా అంతే సులభంగా మారిపోతాయా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అనుమతుల మంజూరులో వేగం కంటే క్షేత్రస్థాయి పరిశీలనకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కార్యాలయాల చుట్టూ తిరిగే రోజులకు స్వస్తి!

గతంలో తాత్కాలిక బాణసంచా దుకాణాలకు ఎఫ్-5 అనుమతులు పొందాలంటే వ్యాపారులు అనేక దశలు దాటాల్సి వచ్చేది. తొలుత అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల నుంచి సంబంధిత అనుమతులు తీసుకోవాలి. అనంతరం ఆర్టీఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి. అక్కడి నుంచి జిల్లా రెవెన్యూ అధికారి ద్వారా కలెక్టర్ పరిశీలనకు వెళ్లిన తర్వాత తుది అనుమతులు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియలో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 94412 36448 నంబరుకు 'హై' అని సందేశం పంపితే దరఖాస్తు ఫారానికి సంబంధించిన లింక్ వస్తుంది. అందులో దుకాణదారుడి పేరు, దుకాణం ఏర్పాటు



చేయనున్న ప్రాంతం, ప్లాట్ సర్వే నంబరు, జిల్లా, సమీప అగ్నిమాపక కేంద్రం వివరాలు నమోదు చేయాలి. రూ.500 దరఖాస్తు రుసుము చెల్లించి చలానా జతచేస్తే తదుపరి ప్రక్రియ ప్రారంభమవుతుంది.

క్లిక్ చేస్తే అనుమతి వచ్చినట్లేనా?

వాట్సాప్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా అనుమతులు వచ్చేస్తాయన్న ప్రచారం కొందరు వ్యాపారుల్లో నెలకొంది. అయితే ఆన్‌లైన్ దరఖాస్తు కేవలం ప్రక్రియను సులభతరం చేసే మార్గమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దరఖాస్తులు ఆర్టీఓ కార్యాలయంతో పాటు మున్సిపల్, పోలీసు శాఖల పరిశీలనకు వెళ్లాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగానే సంబంధిత శాఖల నుంచి నిర్ధారణ అవసరం. ముఖ్యంగా అగ్నిమాపక శాఖ క్షేత్రస్థాయిలో దుకాణాలను పరిశీలించి అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలు, ఇతర నిబంధనల అమలును నిర్ధారించాల్సి ఉంటుంది. బాణసంచా నిల్వ, విక్రయాలు అత్యంత అప్రమత్తతతో చేపట్టాల్సిన అంశాలు కావడంతో తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు అందిందా? అన్నదానికంటే.. దుకాణం ఏర్పాటుకు సూచించిన స్థలం నిబంధనలకు అనుగుణంగా ఉందా? అన్నది కీలకం.

శ్రీకాకుళం నుంచే అత్యధిక దరఖాస్తులు!

జిల్లాలో ఈసారి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 76 దరఖాస్తులు అందగా.. వాటిలో శ్రీకాకుళం డివిజన్ నుంచే 52 వచ్చినట్లు సమాచారం. వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల వ్యాపారులు కూడా ముందుకొస్తున్నారు. మరో రెండు రోజుల్లో అనుమతుల ప్రక్రియను పూర్తి చేసి దుకాణాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. అయితే అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండటంతో దరఖాస్తుల పూర్తి వివరాలు అందుబాటులో లేవు.

తనిఖీల్లో వేగం సరిపోతుందా?

దీపావళి సమయంలో బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద ప్రజల రద్దీ ఎక్కువగా ఉంటుంది. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రతి దుకాణం వద్ద అగ్నిమాపక పరికరాలు, ప్రమాద నివారణ ఏర్పాట్లు, నిబంధనలకు అనుగుణమైన స్థలం ఉన్నాయా లేదా అన్నది అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలి. దరఖాస్తుల స్వీకరణకు సాంకేతికతను వినియోగించడం స్వాగతించదగ్గదే అయినా.. అనుమతుల మంజూరులో భద్రతే ప్రామాణికంగా ఉండాలి. వ్యాపారులకు వెసులుబాటు కల్పించే క్రమంలో ప్రజల ప్రాణాల రక్షణకు సంబంధించిన నిబంధనలు పక్కనపడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. వాట్సాప్‌తో దరఖాస్తుల ప్రయాణం వేగవంతమైంది.. మరి క్షేత్రస్థాయి తనిఖీలు కూడా అదే స్థాయిలో జరుగుతాయా అన్నది వేచి చూడాలి.

ఈ నాలుగు ఉత్తమ దానాలు



దానానాంచ సమస్తానామ్ చతుర్వేతాని భూతలే
శ్రేష్ఠని కన్యా గో భూమి విద్యాదానని సర్వదా॥

కన్యాదానం, గోదానం, భూదానం, విద్యాదానం ఈ నాలుగింటినీ అత్యున్నత దానాలుగా పేర్కొన్నాయి మన శాస్త్రాలు. కన్యాదానం వల్ల ఒక కుటుంబం ఏర్పడుతుంది. భూదానం, గోదానం వల్ల కుటుంబానికి అవసరమైన పాడిపంటలు సమకూరుతాయి. విద్యాదానం వల్ల అజ్ఞానం అంతరించి, జీవన విధానానికి దారి దొరుకుతుంది. ఇవే కాకుండా దశ దానాలనీ, షోడశ దానాలనీ కూడా ఉన్నాయి.

మరి ఇన్ని దానాలలో చేర్చనిదీ, ఆర్తులకు ఆకలిని తీర్చేది అన్నదానం. దీనులకు సాయపడటాన్ని 'దానం' అని అభివర్ణించారు. కాబట్టి పైన పేర్కొన్న అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని పెద్దల మాట. మరణభయంతో విలవిల్లాడే వాడికి అభయం ఇవ్వడం, వ్యాధిగ్రస్తుడికి సరైన చికిత్స అందించడం, విద్యాభిలాషికి విద్యాదానం చేయడం, ఆకలితో ఉన్నవానికి అన్నదానం చేయడం... ఈ నాలుగూ చతుర్విధ ఉత్తమ దానాలు.

వీధి వ్యాపారుల కోసం సౌర శక్తి బండి



ఖరగ్‌పూర్: డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కలిగిన సౌర శక్తితో నడిచే ఆహార విక్రయ బండిని ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసింది. ప్రభుత్వ స్థలాలను శాశ్వతంగా ఆక్రమించకుండా ఈ బండిని వ్యాపారులు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి నడుపుతూ వివిధ వినియోగదారుల బృందాలకు సేవలందించవచ్చు. మూడు చక్రాలు కలిగిన ఈ బండిని శుక్రవారం సంస్థ క్యాంపస్‌లో ప్రారంభించిన 'నగర ఉద్యమం - వీధి వ్యాపారి నుంచి చురుకైన పారిశ్రామికవేత్త వరకు' కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ బండిలో ఉత్పత్తులను బాగా ప్రదర్శించే సదుపాయం, మూడు మార్గాల్లో చెత్తను వేరు చేసే పద్ధతి ఉంటాయి. తమ సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్టు ఐఐటీ ఖరగ్‌పూర్ సంచాలకులు సుమన్ చక్రవర్తి తెలిపారు. సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం క్షేత్ర స్థాయి పరిష్కారాలకు సాంకేతికతను ఉపయోగించడంలో తమ నిబద్ధతను ఈ ఆవిష్కరణ ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టును పరీక్షించడం కోసం తమ సేతు క్లౌడ్ కిచెన్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానిస్తామన్నారు.

రైల్లో ఫోన్ స్పీకర్ ఆన్ చేస్తే జైలుకే..



న్యూఢిల్లీ: రైళ్లలో, రైల్వే స్టేషన్లలో ఫోన్ స్పీకర్ మోడ్‌లో పెట్టి పాటలు వినడం, వీడియోలు చూడటం వల్ల తోటి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని దక్షిణ రైల్వే తెలిపింది. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.1,000 వరకు జరిమానా విధించడంతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ విధంగా ప్రవర్తించే ప్రయాణికులను రైలు కోచ్ లేదా రైల్వే ప్రాంగణం నుంచి బయటకు పంపే అధికారం అధికారులకు ఉంటుందని హెచ్చరించింది. ప్రజలకు న్యూసెన్స్ కలిగించే అంశాలపై రైల్వే చట్టంలోని సెక్షన్ 142ను దక్షిణ రైల్వే ప్రయోగిస్తున్నది. ప్రయాణికులు పదే పదే ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే ఆరు నెలల వరకు జైలు శిక్షతో పాటు రూ. 5,000 వరకు జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుంది. పబ్లిక్ స్థలాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలను భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 270 ప్రకారం నేరంగా పరిగణిస్తారు. రైళ్లలో టికెట్ ఎగ్జామినర్లు , కమర్షియల్ విభాగానికి చెందిన సీనియర్ అధికారులు రూ.1,000 జరిమానాను అక్కడికక్కడే విధించే అధికారాన్ని కలిగి ఉంటారు. రైల్వే శాఖతో పాటు మెట్రో రైళ్లలో కూడా ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే జరిమానాలు విధించడం, కోచ్‌ల నుంచి దింపివేయడం వంటి నిబంధనలు అమల్లో ఉన్నాయని అధికారులు గుర్తుచేశారు. స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగిన నేపథ్యంలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్ని రైల్వే డివిజన్లను ఆదేశించారు.

భారత్‌కు అప్పుల గుబులు

అమరావతి: ప్రపంచవ్యాప్తంగా వర్ధమాన (అభివృద్ధి చెందుతున్న) దేశాలను అప్పుల భారం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విద్య, వైద్య మౌలిక వసతుల కల్పన కంటే అప్పులపై వడ్డీల కోసమే ఏటా అధికంగా వెచ్చించాల్సి వస్తోంది. 2025 నాటికి భారత్‌పై ఉన్న మొత్తం అప్పుల భారం ఏకంగా రూ. 315 లక్షల కోట్లకు చేరిందని ఐక్యరాజ్యసమితికి చెందిన 'కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్' నివేదిక వెల్లడించింది. గడిచిన 15 ఏళ్లలో ఈ అప్పులు అమాంతం పెరిగాయని, వర్ధమాన దేశాల ప్రగతికి ఇది పెద్ద సవాలుగా మారిందని స్పష్టం చేసింది. యూఎన్‌సీటీడీ నివేదికలో ఏముందంటే... ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు అప్పులపై వడ్డీల కోసమే 2025లో రూ.95లక్షల కోట్లు వెచ్చించాయి. 2010లో వర్ధమాన దేశాలు అప్పులపై వడ్డీల భారం రూ.34.50 లక్షల కోట్లు...కాగా 2025 నాటికి రూ.95 లక్షల కోట్లకు పెరిగాయి. 51 వర్ధమాన దేశాలు విద్య, వైద్య రంగంపై కంటే అప్పులకు వడ్డీల చెల్లింపు కోసమే ఎక్కువ బడ్జెట్‌ను కేటాయించాల్సి వస్తోంది. అధిక వడ్డీ రేట్ల కారణంగా వర్ధమాన దేశాలు ఏటా రూ.47,614 కోట్లు అధిక భారాన్ని భరించాల్సి వస్తోంది. ఆ మొత్తంతో 13 లక్షల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు. 16లక్షల మంది బాలలకు పౌష్టికాహారాన్ని అందించవచ్చని యూఎన్‌సీటీడీ నివేదిక పేర్కొంది.

బలిపీఠంపై ఎన్నికల అధికారులు

అమరావతి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార దాహానికి అధికారులు, ఉద్యోగులు సమిధలవుతున్నారు. ప్రజాబలం లేకుండా స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీ చేస్తున్న దాష్టీకాలతో ఒకవైపు అధికారులు, మరో వైపు సామాన్య ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ఇది ప్రస్ఫుటమవుతోంది. ప్రతిదశలోనూ, ప్రతి అంకంలోనూ అధికారగణం చంద్రబాబు ఆదేశాలకు దాసోహమై విధులు నిర్వర్తించాల్సివస్తోంది. అధికారులు, ఉద్యోగుల బలహీనతలను ఆసరా చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం వారిని భయపెట్టి పెత్తనం చెలాయిస్తోంది. ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయని ఉద్యోగులు, అధికారులపై బదిలీ వేటు, కేసులు నమోదు తప్పదనే ముందస్తు హెచ్చరికలు చేసినట్టు తెలుస్తోంది. ఎన్నికల ఉద్యోగుల ప్రైవేట్ సంభాషణల్లో ఇది స్పష్టంగా వినవస్తోంది.

చివరకు రిటర్నింగ్ అధికారులను ప్రభుత్వం తమ చెప్పుచేతల్లో ఉంచుకుని చెప్పినట్టు పని చేయించుకుంటోంది. వారికున్న అధికారాలను సైతం లాక్కుని కట్టుబానిసల్లా మార్చేసింది. చిత్తూరు జిల్లాలో ఓ రిటర్నింగ్ అధికారి తనపై ఉన్న పైస్థాయి ఒత్తిడి కారణంగా ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల నామినేషన్లు తీసుకోలేనని తన నిస్సహాయతను వ్యక్తం చేయడమే ఇందుకు నిదర్శనం. తమ కళ్లెదుటే ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను అధికార పార్టీ నాయకులు చింపేసినా చర్యలు తీసుకోవడం కాదుకదా కనీసం నోరు మెదపలేని దుస్థితిలో ఎన్నికల అధికారులు ఉండడం చంద్రబాబు దాష?టీకాలకు మరో ప్రబల ఉదాహరణగా నిలుస్తోంది. అనంతపురం జిల్లా చిత్రచేడులో ఎన్నికల సిబ్బందిని బెదిరించి 984 బ్యాలెట్ల పేపర్లపై ముద్రలు వేసుకున్నారని ఎన్నికల కమిషన్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రాణం తీసిన ఒత్తిడి : ఎన్నికల సిబ్బందిపై చంద్రబాబు ప్రభుత్వం మోపుతున్న ఒత్తిడి ఓ ఉద్యోగిని బలి తీసుకుంది. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలానికి చెందిన ఉపాధ్యాయురాలు హరిత గౌడ్ (57) గురువారం కూడేరు మండలం కడదరకుంట పోలింగ్ కేంద్రంలో ఏపీవోగా విధుల్లో ఉన్నారు. పోలింగ్ జరుగుతుండగానే ఆమె గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందారు. ఉద్రిక్తతకు కేంద్రంగా మారిన మండలం అది. మరుట్లలో పట్టపగలే బ్యాలెట్ బాక్స్ ఎత్తుకెళ్లడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. అలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి రావడంతో ఆమె తీవ్ర ఒత్తిడికి లోనై మృతి చెందినట్టు తెలుస్తోంది. తుఫాన్ హెచ్చరికలు ఉన్నా ఎన్నికల తేదీ మార్చకపోవడంతో యాదవోలులో సిబ్బంది నీళ్లలో నిలబడి విధులు నిర్వహించాల్సి వచ్చింది. అన్నిచోట్లా పోలింగ్ విధులు నిర్వహించడం ఉద్యోగులకు కత్తిమీద సాములా మారింది. ఎన్నికల విధిని ఒకప్పుడు బాధ్యతగా భావించిన ఉద్యోగు లు, ఇప్పుడు ఆ డ్యూటీ అంటేనే వణికిపోయే పరిస్థితి వచ్చింది.

కోర్టు బోనులో నిలబడాల్సిందే.. అసలు సమస్య ఎన్నికల తర్వాతే మొదలవుతుంది. నామినేషన్ల తిరస్కరణలు, ఉపసంహరణలు, ఏకగ్రీవాలపై పలువురు అభ్యర్థులు ఇప్పటికే న్యాయస్థానం తలుపు తట్టారు. ఆ కేసుల్లో బోనులో నిలబడేది ఎన్నికల విధుల్లో సంతకాలు చేసిన ఉద్యోగులే. ఆదేశాలిచ్?చన మంత్రులు, ఎమ్మెల్యేలు కాదనే విషయం వారికి తెలిసినా నోరు విప్పలేని పరిస్థితి.. చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు, ఐఆర్ సహా అన్నీ ఇచ్చేస్తామని చెప్పి అధికారం చేజిక్కించుకున్న తరువాత అవేమీ నెరవేర్చకపోగా, వారిని రాజకీయ చదరంగంలో పావులుగా మార్చేశారు. ఈ ఎన్నికల్లో అవకతవకలపై కోర్టు మెట్లు ఎక్కే సమయంలో తమకు అండగా నిలిచేదెవరనే ప్రశ్న ఇప్పుడు ఉద్యోగ వర్గాలను కలవరపాటుకు గురిచేస్తోంది.

ఇబ్రహీంపట్నం: బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లు మాయం



ఎన్టీఆర్ జిల్లా: ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఓట్ల లెక్కింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయి. పోలైన ఓట్లకు బ్యాలెట్ బాక్స్‌లో ఉన్న ఓట్లకు తేడాపై వైఎస్సార్‌సీపీ నేతలు నిలదీశారు. కొటికలపూడి ఎంపీటీసీ స్థానంలో ఓట్ల తేడాతో గందరగోళం నెలకొంది. 2432 ఓట్లు పోల్ కాగా, బ్యాలెట్ బాక్స్‌లో 2427 ఉన్నట్లు గుర్తించారు. ఓట్ల మాయం చేశారంటూ వైఎస్సార్‌సీపీ నేతలు ఆందోళనకు దిగారు. ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలను సీఐ సుబ్రమణ్యం అడ్డుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని 16 మండలాల జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల ఓట్ల లెక్కింపునకు 9 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 18 కౌంటింగ్ హాల్స్, 281 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఏ.కొండూరు, విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం మండలాల సెగ్మెంట్లు తిరువూరులోని శ్రీవాహిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కేంద్రం, విజయవాడ రూరల్ మండలానికి సంబంధించి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం, ఓల్డ్ మాంటిస్సోరి కళాశాల, జి.కొండూరు మండలం ఓట్లు లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..మైలవరం, రెడ్డిగూడెం మండలాల ఓట్ల లెక్కింపు లకిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియం (మైల వరం), ఇబ్రహీంపట్నం ఓట్ల లెక్కింపు జెడ్పీ బాలికల హైస్కూ ల్ (కొండపల్లి), జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్స వాయి మండలాల ఓట్ల లెక్కింపు ఎస్‌జిఎస్ కళాశాల (జగ్గయ్యపేట), నందిగామ ఓట్లు జిల్లా పరిషత్ హై స్కూల్ (నందిగామ), చందర్లపాడు ఓట్ల లెక్కింపు కేవీఆర్ డిగ్రీ కళా శాల (నంది గామ), కంచికచర్ల, వీరులపాడు మండలాల ఓట్ల లెక్కింపు వ్యవసాయ మార్కెట్ యార్డ్ (కంచికచర్ల)లో నిర్వహిస్తున్నారు.


సూపర్ ఎల్‌నినో ముప్పు.. భారత్‌లో వేడెక్కనున్న శీతాకాలం

భారత్‌లో నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమైన నేపథ్యంలో సూపర్ ఎల్‌నినో ముప్పు పొంచి ఉంది. దీని ప్రభావంతో ఈ ఏడాది శీతాకాలంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, హిమపాతం తగ్గవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామం వ్యవసాయం, నీటి లభ్యత, విద్యుత్ వినియోగం, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సమయంలో సాధారణం కంటే సుమారు 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో ఇప్పటికే పంటలకు నష్టం వాటిల్లింది. ఇప్పుడు శీతాకాలంలో చలి తీవ్రత తగ్గి, మంచు కురిసే పరిమాణం కూడా తగ్గితే వ్యవసాయ రంగానికి మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది.

భూమధ్యరేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు వేగంగా బలపడుతున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాబోయే నెలల్లో ఇది సూపర్ ఎల్‌నినో స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. డిసెంబరులో ఎల్‌నినో అత్యంత శక్తిమంతమైన స్థాయికి చేరుకునే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఎల్‌నినో బలపడితే శీతాకాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవడంతో పాటు వర్షపాతం, హిమపాతం తగ్గవచ్చని అంచనా. దీనివల్ల రబీ పంటల సాగు, నేలలో తేమ నిల్వ ఉండటం వంటి అంశాలు ప్రభావితమవుతాయి. వేసవిలో తాగునీటి లభ్యతపైనా ప్రతికూల ప్రభావం పడవచ్చు.

ఎల్‌నినో ప్రభావం కేవలం శీతాకాలానికే పరిమితం కాకపోవచ్చని



నిపుణులు భావిస్తున్నారు. 2027 వేసవి ప్రారంభంలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవడానికి, నీటి కొరత తీవ్రం కావడానికి, విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడానికి ఈ పరిస్థితులు కారణమయ్యే అవకాశం ఉంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం, ప్రస్తుతం బలపడుతున్న ఎల్‌నినో 2015-16లో నమోదైన అత్యధిక స్థాయిని కూడా అధిగమించే అవకాశం ఉంది. దీని ప్రభావం భారత్‌కే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు, వర్షపాతం తీరుపై పడవచ్చని అంచనా వేస్తున్నారు. రాబోయే నెలల్లో ఎల్‌నినో ఎంత బలపడుతుంది, దాని ప్రభావం భారత వాతావరణంపై ఏ స్థాయిలో ఉంటుంది అనేది కీలకం. ముఖ్యంగా పంటల సాగు, నీటి నిల్వలు, విద్యుత్ అవసరాలపై పరిస్థితులను నిశితంగా గమనించాల్సి ఉంటుంది.

జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ జనాభా గణన నమోదు



అమరావతి: జనాభా గణన--2027లో భాగంగా వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలు స్వయంగా జనాభా గణన వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గెజిట్‌ను రాష్ట్ర గెజిట్‌లో తిరిగి ప్రచురిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటింటికి తిరిగి జనాభా గణన వివరాల నమోదు ప్రక్రియ జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుంది. అంతకుముందు జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు తమంతట తాముగా జనాభా గణన వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. జనాభా సవరణాత్మక దశ వచ్చే ఏడాది మార్చి 1 నుంచి 5 వరకు ఉంటుంది. జనాభా గణన నిర్ణీత ప్రామాణిక సమయం వచ్చే ఏడాది మార్చి ఒకటో తేదీ అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు.

ఉత్తరాఖండ్‌లో హ్యాట్రిక్ సాధించాలి



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో హ్యాట్రిక్ సాధించాలని బీజేపీ నేతలు, కార్యకర్తలకు కేంద్ర హోంశాఖ మంత్రి, పార్టీ సీనియర్ నేత అమిత్ షా పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 65కు పైగా స్థానాలు గెలుచుకోవాలనే లక్ష్యంగా నిర్దేశించారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం డెహ్రాడూన్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఉత్తరా ఖండ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 'ముస్లిం విశ్వవిద్యాల యం'కోసం ఆందోళన జరిగిందని గుర్తుచేశారు. నేడు బీజేపీ ప్రభుత్వం అక్రమ ప్రార్థన మందిరాలు, మదర్సాలను తొలగిస్తోందని, ప్రభుత్వ భూములను కాపాడుతోందని తెలిపారు. అంతేకాకుండా, 'ఉత్తరాఖండ్ గళం'కాంగ్రెస్ నేత రాహుల్ గ్యాంధీకి చేరాలని అన్నారు. హల్ద్వానిలో 29 ఎకరాల ప్రభుత్వ భూమి నుంచి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించినప్పుడు రాహుల్ గాంధీ అసహనానికి గురయ్యారని విమర్శించారు. చొరబాటు దారులను కాపాడే ప్రయత్నాలు మానుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఉత్తరాఖండ్‌ను సురక్షితమైన, సంపన్నమైన రాష్ట్రంగా మార్చాలని, ఈ దేవభూమిని దేశ సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలన్న తమ ధ్యేయమని అమిత్ షా ప్రకటించారు. రాష్ట్రంలో బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 65కు స్థానాలను బీజేపీ గెలుచుకోవడం తథ్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని పార్టీ కార్యకర్తలను కోరారు.

ఇక్కడ ఊపిరే ఓ సవాల్.. భారత్‌లో అద్భుత గ్రామం!

ఊపిరి పీల్చుకోవడమే కష్టమైనంత పలుచని గాలి.. అడుగు బయటపెడితే గడ్డకట్టించే చలి.. కళ్లెదుట ఎక్కడ చూసినా మంచుకొండలే.. చెట్లు కనిపించవు.. శీతాకాలంలో దాదాపు ఆరు నెలలు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అయినా అక్కడ మనుషులు నివసిస్తున్నారు. ఇళ్లలో సంబరాలు చేసుకుంటున్నారు. పశువులను పెంచుతున్నారు. జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇది ఏ సైన్స్ ఫిక్షన్ కథ కాదు.. హిమాలయాల ఒడిలో సముద్ర మట్టానికి 15,050 అడుగుల ఎత్తులో ఉన్న కొమిక్ గ్రామం కథ!



ఆకాశానికి దగ్గరగా కొమిక్..

హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పితి లోయలో ఉన్న కొమిక్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మానవ నివాస ప్రాంతాల్లో ఒకటి. సముద్ర మట్టానికి సుమారు 4,587 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ చిన్న బౌద్ధ గ్రామంలో దాదాపు 100 మంది నివసిస్తున్నారు. గ్రామ ప్రవేశద్వారం వద్దే ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటారుబుల్ రోడ్డుతో అనుసంధానమైన గ్రామమని తెలిపే బోర్డు కనిపిస్తుంది. మంచుతో కప్పబడిన హిమాలయ శిఖరాల మధ్య తెల్లని మట్టి, రాతి ఇళ్లు.. నీలాకాశం కింద నిశ్శబ్దంగా కనిపించే ఈ గ్రామం ఫొటోల్లో చూస్తే స్వర్గంలా అనిపిస్తుంది. కానీ అక్కడ నివసించే వారికి మాత్రం ప్రతి రోజు ఓ సవాలే.

ఆక్సిజన్ కూడా విలాసమే!: సముద్ర మట్టంతో పోలిస్తే కొమిక్‌లో ఆక్సిజన్ స్థాయి చాలా తక్కువ. అక్కడికి కొత్తగా వెళ్లే వారికి పలుచని గాలితో శరీరం ఇబ్బంది పడుతుంది. కొందరిలో ఆక్సిజన్ సాచురేషన్ గణనీయంగా పడిపోవచ్చు. అయితే తరతరాలుగా అక్కడే నివసిస్తున్న స్థానికులు ఈ వాతావరణానికి అలవాటు పడిపోయారు. అక్కడి ప్రజల జీవితం ప్రకృతితో నిరంతర పోరాటమే. తీవ్రమైన చలి కారణంగా చెట్లు, చాలా మొక్కలు కూడా పెరగడం కష్టం. నీరు గడ్డకట్టేంత చలి ఉంటుంది. శీతాకాలంలో పరిస్థితులు మరింత దారుణంగా మారతాయి.

ఆరు నెలలు ప్రపంచానికి దూరం! : భారీ మంచు కారణంగా స్పితి లోయలోని పర్వత మార్గాలు మూసుకుపోతాయి. ఫలితంగా కొమిక్ సహా ఈ ప్రాంతంలోని గ్రామాలు సంవత్సరంలో దాదాపు ఆరు నెలల పాటు దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి దాదాపు పూర్తిగా వేరుపడతాయి. ఫోన్, ఇంటర్నెట్ సదుపాయాలు కూడా పరిమితమే. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కీలక సౌకర్యాలు దూరంగా ఉంటాయి. అయినా స్థానికులు తమకు తామే ఏర్పాట్లు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొమిక్ ఇళ్ల నిర్మాణం కూడా అక్కడి వాతావరణానికి తగ్గట్టుగానే ఉంటుంది. మట్టి, రాళ్లతో నిర్మించే ఇళ్ల గోడలు దాదాపు రెండు అడుగుల మందంతో ఉంటాయి. ఇళ్లకు తెల్లని రంగు వేయడం ద్వారా పగటి సూర్యకాంతిని ప్రతిబింబింపజేసి లోపల వెచ్చదనాన్ని కొంతమేర కాపాడుకుంటారు. చుట్టుపక్కల చెట్లు లేకపోవడంతో ఇంధనం కూడా సమస్యే. యాక్‌లు, ఆవులు, గాడిదల ఎండిన పేడను ఇంధనంగా ఉపయోగిస్తారు. రాత్రి వేళ పశువులను కూడా తీవ్ర చలి నుంచి రక్షించేందుకు ఇళ్లలోనే ఉంచుతారు.

నీరు గడ్డకట్టినా.. జీవితం ముందుకు! : చలికాలంలో నీరు గడ్డకట్టడం సాధారణమే. ఇలాంటి పరిస్థితుల్లో స్థానికులు తమ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక పద్ధతులను అవలంబిస్తారు. పాత్రలు కడగడానికి కూడా కట్టెల సాయంతో నీటిని వేడి చేసుకునే ఏర్పాట్లు చేసుకుంటారు. ఇక్కడి జీవితం మనకు సాధారణంగా అనిపించే ఎన్నో విషయాల విలువను గుర్తుచేస్తుంది. నీరు, వేడి, ఆక్సిజన్.. మనకు సహజంగా లభించే ఇవన్నీ కొమిక్ ప్రజలకు విలువైన వనరులే. కొమిక్ చుట్టుపక్కల ప్రాంతం ప్రకృతి అందాలతోనే కాదు.. కోట్ల సంవత్సరాల చరిత్రతోనూ ఆశ్చర్యపరుస్తుంది. సమీపంలోని లాంగ్జా గ్రామంలో లభించే సముద్ర జీవుల శిలాజాలు.. ఈ ప్రాంతంలో ఒకప్పుడు టెథిస్ సముద్రం ఉండేదని సూచిస్తున్నాయి. అంటే నేడు మంచుకొండలు కనిపిస్తున్న ఈ ప్రాంతం.. కోట్ల సంవత్సరాల క్రితం సముద్రంలో భాగంగా ఉండేదన్నమాట!.

ప్రపంచంలోనే ఎత్తైన పోస్టాఫీసు.. కొమిక్‌కు సమీపంలోని హిక్కిమ్ గ్రామం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పోస్టాఫీసుల్లో ఒకటికి ప్రసిద్ధి చెందింది. పరిమిత కనెక్టివిటీ ఉన్నప్పటికీ దశాబ్దాలుగా ఈ పోస్టాఫీసు ఈ మారుమూల ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తోంది. కొమిక్‌లో జనాభా తక్కువ. ఇళ్లు కూడా కొద్దే. కానీ అక్కడి ప్రజల మధ్య బంధం మాత్రం బలంగా ఉంటుంది. గ్రామంలోని ఒక ఇంట్లో వేడుక జరిగితే.. అది ఒక్క కుటుంబానిదిగా ఉండదు. ఊరంతా కలిసి సంబరాల్లో భాగమవుతుంది.

ప్రకృతి ఎంత కఠినంగా ఉన్నా.. మనుషుల మధ్య ఆప్యాయత మాత్రం ఆ చలిని జయిస్తుంది. మంచుకొండల మధ్య.. ఆకాశాన్ని తాకే ఎత్తులో.. ఆక్సిజన్ తక్కువగా ఉన్నా ఆశలు మాత్రం ఎక్కువగా ఉన్న గ్రామం కొమిక్. ప్రపంచానికి దూరంగా ఉన్న ఈ చిన్న గ్రామం.. ప్రకృతి ఎంత కఠినమైనా మనిషి జీవించాలనే పట్టుదల ముందు అది కూడా ఓడిపోతుందని నిరూపిస్తోంది.

ఈ నెల 11 నుంచి 'ఆక్వాన్' తుపాన్



విశాఖపట్నం : ఒక తుపాను ముప్పు నుంచి బయటపడకముందే.. మరో తుపాను బంగాళాఖాతంలో సిద్ధమైంది. ఈ నెల 11 నుంచి 16 మధ్య బంగాళాఖాతంలో 'ఆక్వాన్' తుపాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. అనుకూల వాతావరణ పరిస్థితులు ఉంటే నవంబర్ మూడో వారంలో తుపానుగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నది.

ముందుగా అర్ణబ్, ఆ తర్వాత మురసు, ఇప్పుడు ఆక్వాన్ ఇలా తకువ వ్యవధిలో వరుసగా తుపానులు ఏర్పడటం ఆందోళన కలిగిస్తున్నాయి. ఆక్వాన్‌తో తెలంగాణలో వర్షాలు పడతాయా? ఎకడ పడతాయి? అనే విషయాలు ఇప్పుడే చెప్పలేమని నిపుణులు పేర్కొంటున్నారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదన్న అంచనాలు ఉన్నాయి. అది అనుకూల పరిస్థితుల్లో బలపడితే ఆక్వాన్ పేరుతో తుపానుగా మారొచ్చు.

శ్వేతసౌధంలో దీపావళి వేడుక.. ట్రంప్‌కు హనుమాన్ చాలీసా గిఫ్ట్



న్యూయార్క్: అమెరికా శ్వేతసౌధంలో దీపావళి సంబరాలు జరిగాయి. దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఇండో అమెరికన్ ప్రముఖులు కొందరు కలిశారు. ఈ సందర్భంగా ఓవల్ ఆఫీసులో ట్రంప్ దీపం వెలిగించారు. ట్రంప్‌ను కలిసిన వారిలో మైక్రాన్ టెక్నాలజీ సీఈవో సంయ్ మెహ్రోత్రాతో పాటు అనేక మంది ఉన్నారు. అమెరికాలోని భారతీయ అంబాసిడర్‌వినయ్ మోహన్ ఖత్రా, సెలబ్రిటీ చెఫ్ వికాస్ ఖన్నా, వ్యాపారవేత్త విశాల్ గోండల్, ఐబీఎం సీఈవో అరవింద కృష్ణ, ఎఫ్‌బీఐ కాశ్ పటేల్, అమెరికా ఆరోగ్య శాఖ డైరెక్టర్ జే భట్టాచార్య శ్వేతసౌధంలో జరిగిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఓవల్ ఆఫీసులో ట్రంప్ దీపం వెలిగించి పండుగ సంబరాలను ప్రారంభించారు. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, డిప్యూటీ కమీషనర్ అర్జున్ మోడీ కూడా ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఓవల్ ఆఫీసులో జరిగిన వేడుక గురించి గోండల్ తన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. డోనాల్డ్ ట్రంప్‌కు హనుమాన్ చాలీసా గిఫ్ట్‌గా ఇచ్చినట్లు పేర్కొన్నారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు బలపడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కొవ్వాడ కాల్వలో వరద ఉద్ధృతి..



తాళ్లపూడి: మురసు తుపాను ప్రభావంతో తాళ్లపూడి మండలంలో భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు పంటచేలు నీటమునిగాయి. ఒక వైపు కుండపోత వర్షం.. మరో వైపు కొవ్వాడ కాలువ వరద ఉద్ధృతికి పంట పొలాలు గోదారిని తలపిస్తున్నాయి. నాలుగు రోజులైన వరదనీరు తగ్గుముఖం పట్టలేదు. బయ్యవరం సమీపంలోని పోచవరం, తాడిపూడికి చెందిన పంటభూములు పూర్తిగా నీటమునిగాయి. గజ్జరం సంగం చెరువు, అన్నదేవరపేటలోని రెండు కల్వర్టుల సమీపంలో తిరుగుడుమెట్ట, పెద్దేవం, మలకపల్లి, కుకునూరు పంటచేలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. ప్రక్కిలంక ఏటిగట్టు నుంచి అన్నదేవరపేటమీదుగా గోపాలపురం వెళ్లే రహదారిలో ఇంకా వరదనీరు ప్రవహిస్తోంది. తాడిపూడి నుంచి పోచవరం, అన్నదేవరపేట నుంచి తిరుగుడుమెట్ట, వెంకటాయపాలెం రహదారులు ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి. పెద్దేవం, మలకపల్లి నుంచి తిరుగుడుమెట్ట వెళ్లే రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనచోదకులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రహదారుల్లో కొన్నింటిలోనూ మాత్రమే లారీలు, ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు.

రైళ్లల్లో తనిఖీలు ముమ్మరం



అమరావతి: దీపావళి, ఛత్ పూజ పండుగల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై విజయవాడ రైల్వే డివిజన్ ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఆర్ఎం మోహిత్ సోనకియా శుక్రవారం తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలో ధూమపానానికి సంబంధించి 23 కేసులు నమోదు చేయడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి రూ.46 వేల జరిమానా వసూలు చేసినట్లు పేర్కొన్నారు. పండుగల సమయంలో రద్దీ పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. టపాసులు, పేలుడు పదార్థాలు, ఇతర మండే వస్తువులను రైళ్లలో తీసుకెళ్లవద్దని ప్రయాణికులకు సూచించారు.

బంగారం కొంటున్నారా? తస్మాత్ జాగ్రత్త.. యాసిడ్ పరీక్షలోనూ దొరకని కొత్త కల్తీ!

న్యూఢిల్లీ: బంగారం కొనుగోలుదారులు, నగల వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తున్న కొత్త తరహా కల్తీ దందా వెలుగులోకి వచ్చింది. బంగారంలో రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి భార లోహాల సన్నని పొడిని కలిపి దాని బరువును కృత్రిమంగా పెంచుతున్నారు. ఈ కల్తీ బంగారం అసలైన బంగారంలా ఉండటమే కాకుండా సాధారణంగా చేసే యాసిడ్ పరీక్ష, టచ్‌స్టోన్(గీటురాయి) పరీక్షల్లోనూ దొరుకడం లేదు. నగలను తయారు చేసేందుకు బంగారాన్ని కరిగించినప్పుడు మాత్రమే అసలు మోసం బయటపడుతున్నది. ఈ కొత్త తరహా కల్తీని మార్కెట్లో 'గోల్డ్ పౌడర్'గా పిలుస్తున్నట్లు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సరాఫా మార్కెట్లో పనిచేస్తున్న పలువురు నగల తయారీ కళాకారులు బంగారం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇండోర్ సిల్వర్, గోల్డ్ అండ్ జ్యువెలరీ ట్రేడర్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించింది. బులియన్ వ్యాపారులు, మధ్యవర్తులు బంగారం కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 99.50 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం వ్యాపారానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు స్థానిక వ్యాపారవర్గాలు తెలిపాయి.



మూడేండ్లుగా భారీ లోహాల కల్తీ ఫిర్యాదులు

రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి లోహాలను బంగారంలో కలుపుతున్నారన్న ఫిర్యాదులు గత రెండు మూడేండ్లుగా వస్తున్నాయని వ్యాపారులు చెప్తున్నారు. వీటి సాంద్రత ఎక్కువగా ఉండటంతో తక్కువ పరిమాణంలో కలిపినా బంగారం మొత్తం బరువు పెరుగుతుంది. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ మార్గాల ద్వారా ఈ కల్తీ పదార్థాలు భారత మార్కెట్లకు చేరుతున్నట్టు అనుమానిస్తున్నారు. వీటిని చైనాలో తయారు చేస్తున్నారన్న సందేహాలు కూడా ఉన్నప్పటికీ, వాటి మూలాలపై స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. సాధారణ యాసిడ్, గీటురాయి పరీక్షలతో పాటు పాత తరహా క్యారెట్ పరీక్షా యంత్రాలు కూడా ఈ కల్తీని గుర్తించడంలో విఫలమవుతున్నట్టు వ్యాపారులు చెప్తున్నారు. ఎక్స్రే ఫ్లోరోసెన్స్ (ఎక్స్ఆర్ఎఫ్) పరీక్షలు, ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులతో బంగారంలోని ఇతర లోహాల ఉనికిని గుర్తించే అవకాశం ఉన్నది. అందువల్ల బంగారం కొనుగోలు, విక్రయాల్లో నాణ్యతా పరీక్షలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

వినియోగదారులు ఏం చేయాలి?

- బీఐఎస్ హాల్‌మార్క్ , ఆరు అంకెల గుర్తింపు సంఖ్య ఉన్న నగలనే కొనుగోలు చేయాలి.
- బీఐఎస్ కేర్ యాప్‌లో నంబరును నమోదు చేసి నగ వివరాలు, ప్రకటించిన స్వచ్ఛతను పరిశీలించాలి.
- నమ్మకమైన నగల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- కొనుగోలు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి.
- అనుమానం ఉంటే పరీక్షా కేంద్రంలో నాణ్యతను పరీక్షించాలి.

పెట్రోల్‌లో 31.2% ఇథనాల్!

బెంగళూరు : చమురు మార్కెటింగ్ కంపెనీలు విక్రయించే పెట్రోల్‌లో నిర్దేశిత ఇథనాల్ 20%(ఈ20) మిశ్రమం కంటే గణనీయంగా ఎక్కువ ఉందని కర్ణాటక ప్రభు త్వం శుక్రవారం పేర్కొంది. వివిధ కంపెనీల పెట్రోల్ నమూనాలను పరీక్షించగా పలు నమూనాలలో ఇథనాల్ గాఢత 20%కి మించి ఉన్నట్టు గుర్తించామని, అధికంగా ఇథనాల్ కలపడం వల్ల వాహనదారులు ఆర్థిక నష్టాలకు గురయ్యేఅవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కర్ణాటక వ్యాప్తంగా ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, షెల్ వంటి ప్రధాన చమురు విక్రయ సంస్థల నుంచి మొత్తం 63 నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను మొదట ఆయా చమురు విక్రయ సంస్థల ప్రయోగశాలలకు పంపారు.

వీటితో పాటు కొన్ని ప్రశ్నలను కూడా జత చేశారు. అందులో ప్రతి నమూనాలో ఉన్న ఇథనాల్ పరిమాణానికి సంబంధించిన వివరాలను కోరే ప్రశ్న కూడా ఉంది. అయితే, ఇథనాల్ పరిమాణంపై ఆయా కంపెనీలు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని, ఇందులో ఏదో తేడా ఉందనే అనుమానం రాష్ట్ర ప్రభుత్వానికి కలిగిందని సమాచారం. ప్రభుత్వం ఆ నమూనాలను స్వతంత్ర పరీక్షల కోసం ప్రైవేట్ ప్రయోగశాలలకు పంపింది. బెంగళూరు అర్బన్ సహా ఏడు జిల్లాల నుంచి సేకరించిన నమూనాల పరీక్షల్లో ఇథనాల్ గాఢత 20% అనే ప్రామాణిక స్థాయిని మించి ఉన్నట్టు తెలిసింది. ఈ నమూనాలను బెంగళూరుకు చెందిన శ్రీరామ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరీక్షించింది.

ఈ సంస్థకు నేషనల్ అక్రెడిటేషన్ ఆఫ్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్(ఎన్ఏబీఎల్) గుర్తింపు ఉంది. అంతేగాక ఈ సంస్థ ఐఎస్ఓ ధృవీకరణ పొందింది. ఇది ఈ20 ఇంధనం కాదు. ఇందులో ఇథనాల్ శాతం ఐవోసీఎల్ వద్ద 31.2% కంటే ఎక్కువగా, హెచ్‌పీసీఎల్ వద్ద 30.5%, బీపీసీఎల్ వద్ద 26.5%, నయారా వద్ద 26.1%, షెల్ వద్ద 25.5%గా ఉంది అని కర్ణాటక ప్రభుత్వం ప్రకటనలో వెల్లడించింది. ఈ పరిశోధన ఫలితాలు ఇంధన నాణ్యత నిర్దేశించిన ఇథనాల్ మిశ్రమానికి సంబంధించిన పరిమితిని పాటించడం, అలాగే తగ్గిన మైలేజీ, పెరిగిన వాహన నిర్వహణ ఖర్చుల రూపంలో వినియోగదారులపై పడే ప్రభావం గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. సరళంగా చెప్పాలంటే ఈ20 పెట్రోల్‌లో 20% ఇథనాల్, 80% పెట్రోల్ ఉండాలి. ఒకవేళ ఈ



ఫలితాలు నిర్ధారణ అయితే 25.5% లేదా 30.5% ఇథనాల్ ఉన్న నమూనాలు నిర్ణీత ప్రమాణం నుంచి గణనీయంగా పక్కకు తొలగినట్టుగా పరిగణించాల్సి ఉంటుంది. ఉదాహరణకు హెచ్‌పీసీఎల్‌కి చెందిన ఒక రకమైన పెట్రోల్‌లో(ఎంఎస్-పవర్) 30.5% ఇథనాల్ ఉండగా, మరొక రకమైన పెట్రోల్‌లో(ఎంఎల్) 27% ఇథనాల్ ఉన్నట్టు గుర్తించారు. బీపీసీఎల్‌కు చెందిన స్పీడ్ పెట్రోల్‌లో 26.5 శాతం, నయారా పెట్రోల్‌లో 26.1 శాతం, షెల్ పెట్రోల్‌లో 25.5 శాతం ఇథనాల్ ఉన్నట్టు ఫలితాల్లో తేలింది. బీపీసీఎల్‌కు చెందిన రెండు నమూనాలలో వరుసగా 24.2 శాతం, 22.6 శాతం ఇథనాల్ ఉండగా, హెచ్‌పీసీఎల్‌కు చెందిన ఒక నమూనాలో 22.4 శాతం, అలాగే ఐవోసీఎల్‌కు చెందిన మరో నమూనాలో 20.8 శాతం ఇథనాల్ ఉన్నట్టు నమోదైంది. మిగిలిన పెట్రోల్ నమూనాలలో నయారా పెట్రోల్‌లో ఇథనాల్ శాతం 20.6గా, బీపీసీఎల్ నమూ నాలో 19.9గా, మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ నమూనాలో 19.2గా షెల్ నమూనాలో 13.5గా నమోదయ్యాయి.

నష్టపరిహార నిధి కోసం డిమాండ్ : పెట్రోల్‌లో అధికంగా ఇథనాల్ కలపడం వల్ల ఇంధన సామర్థ్యం తగ్గడం, వాహన నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి నష్టాలకు వాహనదారులకు పరిహారం చెల్లించేందుకు కేంద్రం ఒక నష్టపరిహార నిధిని ఏర్పాటు చేయాలని కర్ణాటక మంత్రి రిజ్వాన్ అర్షద్ డిమాండ్ చేశారు. వాహనాల మైలేజీ 10 శాతం తగ్గితే వాహనదారులకు ఏడాదికి రూ.62, 000 కోట్ల నష్టం వాటిల్లవచ్చని, అలాగే ఇంధనంలో ఇథనాల్‌ను అధికంగా కలపడం వల్ల వాహనాల ఖర్చులు మరో రూ.30,000 కోట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.



చరిత్ర సృష్టించిన ఐఎల్-76 విమానం

న్యూఢిల్లీ: భారతీయ వైమానిక దళానికి చెందిన ఐఎల్-76ఎండీ వ్యూహాత్మక రవాణా విమానం చరిత్ర సృష్టించింది. అత్యంత విజయవంతంగా న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ల్యాండ్ అయ్యింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఆల్టిట్యూడ్‌లో ఈ విమానం ల్యాండ్ కావడం కొత్త మైలురాయిగా నిలిచింది. ఐఎల్-76 విమానానికి చెందిన నైపుణ్యం, ప్రిసిషన్, సిబ్బంది ప్రదర్శించిన ప్రొఫెషనలిజం అమోఘమని ఐఏఎఫ్ తన స్టేట్‌మెంట్‌లో తెలిపింది. దక్షిణ లడాఖ్‌లో.. వాస్తవాదీన రేఖకు 40 కిలోమీటర్ల దూరంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌ను కొత్తగా నిర్మించారు. గత ఏడాదే దీని నిర్మాణం పూర్తి అయ్యింది. గతంలో ఈ ప్రాంతానికి ఏఎన్-32, హెలికాప్టర్ల ద్వారా రవాణా సాగించేవారు. ఇప్పుడు ఫైటర్ విమానాలను కూడా ఆపరేట్ చేసే స్థాయిలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ తయారైనట్లు ఐఏఎఫ్ తన ప్రకటనలో తెలిపింది. భారతీయ వ్యూహాత్మక వైమానిక సామర్థ్యంలో కొత్త మైలురాయి లిఖించినట్లు అవుతుందని ఐఏఎఫ్ చెప్పింది. 1980 మధ్య దశకంలో ఐఎల్-76 రవాణా విమానాలు భారతీయ వైమానిక దళంలో చేరాయి. హెవీ లిఫ్టింగ్‌లో కొత్త చరిత్ర సృష్టించాయి. ఈ విమానాలు 45 టన్నుల బరువును మోయగలవు. లడాఖ్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలకు యుద్ధ ట్యాంకులు, యుద్ధ వాహనాలు, అతిభారీ ఎక్విప్‌మెంట్‌ను ఈ విమానం తరలించగలదు. లేహ్‌తో పాటు తోసి ప్రాంతాలకు లాజిస్టిక్ మిషన్‌లో భాగంగా ఐఎల్-76 విమానాలు వెళ్తుంటాయి. న్యోమా ఎయిర్‌ఫీల్డ్ సముద్ర మట్టానికి సుమారు 10 వేల ఫీట్ల ఎత్తులో ఉన్నది. సియాచిన్‌లో ఆపరేషన్స్ చేపట్టేందుకు ఈ ఎయిర్‌ఫీల్డ్ కీలకంకానున్నది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన ప్రాజెక్టు హిమాంక్‌లో భాగంగా 3 కిలోమీటర్ల పొడువైన కాంక్రీట్ రన్‌వేను న్యోమాలో నిర్మించారు. అయితే ఇక్కడ ఉన్న అతిశీతల వాతావరణాన్ని తట్టుకునే రీతిలో దీన్ని నిర్మించారు.

ముసాయిదాలో పేర్లు గల్లంతైన ఓటర్లకు మరో అవకాశం!

ఢిల్లీ : ఏడు రాష్ట్రా ల్లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన ఓటర్లకు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకొనేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) శుక్రవారం ప్రకటించింది. గణన పత్రాలు జారీ చేసినప్పటికీ గైర్హాజరు, స్థానచలనం, మరణం లేదా నకిలీ(ఏఎస్‌డీడీ)గా వర్గీకరించిన తర్వాత ముసాయిదా జాబితాల నుంచి తొలగింపునకు గురైన ఓటర్లకు ఈ ఆదేశం వర్తిస్తుంది.

ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాలు ఈ ఆదేశం పరిధిలోకి వస్తాయి. తుది ఓటర్ల జాబితాలో చేరే అవకాశాన్ని ఏ అర్హత గల ఓటరుకు కూడా నిరాకరించకుండా చూసేందుకు, నకిలీ నమోదులను నివారించేందుకు ఒక పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఈసీ ఆదేశించింది. ఏఎస్‌డీడీగా గుర్తించబడి, ఫలితంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరులేని ఓటరు రాష్ట్రంలోనే తన నివాస స్థలాన్ని మార్చుకున్న సందర్భాలలో అటువంటి ఓటరు ఫామ్-8 సమర్పించాల్సిన అవసరం లేదు.

దానికి బదులుగా వారు ఇక్కడ అనుబంధం-సీ(అనెక్షర్-సీ) జతచేసిన డిక్లరేషన్‌తో(కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గాన్ని సూచిస్తూ) పాటు గణన పత్రాన్ని సమర్పించాలి అని ఈసీ తెలిపింది. సర్‌లో భాగంగా కొత్త నమోదు కోసం ఇప్పటికే ఫామ్-6 సమర్పించిన ఓటర్లు గణన ఫామ్, దానితో పాటు డిక్లరేషన్‌ను మళ్లీ సమర్పించాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. నవంబర్ 3న కమిషన్ జారీ చేసిన వివరణకు అనుగుణంగా వారి దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని తెలిపింది. సంబంధిత ఓటర్లను సంప్రదించేందుకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయం చేసుకోవాలని బూత్ స్థాయి అధికారులను(బీఎల్ఓ) ఈసీ ఆదేశించింది.

వైఎస్ జగన్‌ను వదిలి వెళ్లలేదు.. వెళ్లేలా కొందరు చేశారు

అమరావతి : మాజీ పార్లమెంట్ సభ్యులు విజయసాయిరెడ్డి మరోసారి వైఎస్ జగన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో ఉన్న సమయంలో కొందరి తప్పుడు ఫిర్యాదు వల్ల జగన్ చేత అవమానాలకు గురైనానని పేర్కొన్నారు. జగన్‌ను తాను వదిలి వెళ్లలేదని.. వెళ్లేలా కొందరు చేశారని వెల్లడించారు.

ఆత్మగౌరవం చంపుకుని వైసీపీలో ఉండలేకే బయటకు వచ్చానని వివరించారు. సామాజిక వర్గాలకు న్యాయం చేయాలనే ఈనెల 11న కొత్త పార్టీ పేరు ప్రకటిస్తున్నానని వెల్లడించారు. రాజ్యాంగబద్ధంగా వచ్చిన హక్కుల అమలు కోసమే పార్టీ పెడుతున్నానని, ఈ పార్టీ రెండు కులాలు, కుటుంబాలకు చెందినది కాదని స్పష్టం చేశారు.

వాహనం ఆగకుండానే టోల్ వసూలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఇకపై టోల్ ప్లాజాల వద్ద నిరీక్షించే అవసరం ఉండదు. టోల్ వసూళ్ల కోసం వాహనాలను నిలపాల్సిన అవసరం లేని బారియర్ రహిత టోల్ విధానంపై భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. నాలుగు లేన్లు, అంతకంటే ఎక్కువ లేన్లు కలిగిన జాతీయ రహదారులపై మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) టోల్ విధానానికి అనుగుణంగా టోల్ ప్లాజాల రూపకల్పన, మౌలిక సదుపాయాలను ప్రామాణీకరించనున్నారు. తాజా మార్గదర్శకాల ప్రకారం టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారియర్ల దగ్గర ఆగకుండా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా టోల్ రుసుము వసూలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తారు. దీనివల్ల వాహనదారుల ప్రయాణ సమయం అదా అవుతుంది. ఇంధన వినియోగం, కాలుష్యం కూడా తగ్గనుంది.

కొత్త మార్గదర్శకాల్లో భాగంగా టోల్ ప్లాజాల లేఅవుట్, టోల్ లేన్ల సంఖ్య, గ్యాంట్రీల ఏర్పాటు, రహదారి నిర్మాణం, లైటింగ్, సూచిక బోర్డులు, ఇతర సదుపాయాలకు సంబంధించి నిర్దిష్ట ప్రమాణాలను సూచించారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై నిర్మించే టోల్ ప్లాజాల్లో ఒకే విధమైన ప్రమాణాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటారు. సంప్రదాయ టోల్ ప్లాజాల్లో వాహనాలు ఆగి రుసుము చెల్లించాల్సి ఉండటంతో ఎక్కువ సంఖ్యలో టోల్ లేన్లు అవసరమవుతున్నాయి. అయితే బారియర్ రహిత విధానంలో వాహనాలు ఆగకుండానే టోల్ వసూలు చేయవచ్చు. దీంతో అవసరమైన లేన్ల సంఖ్యను హేతుబద్ధీకరించి, అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థంగా వినియోగించుకునేలా మార్గదర్శకాలు రూపొందించారు. టోల్ పరిధిలో వాహనాల రాకపోకలు సులభతరం కావడంతోపాటు ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడనుంది.

ఈ మార్గదర్శకాలను భవిష్యత్తులో చేపట్టే అన్ని జాతీయ రహదారి ప్రాజెక్టులతోపాటు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకూ వర్తింపజేస్తారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) దశలో ఉన్న ప్రాజెక్టుల్లోనే కొత్త నమూనాలను చేర్చాలని ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది. ఇప్పటికే కాంట్రాక్టులు ఖరారైన, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో సంబంధిత ఒప్పంద నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేపట్టనున్నారు. ఈ మేరకు ఎన్‌హెచ్ఏఐ క్షేత్రస్థాయి కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది.

పంబలో వాహనాల పార్కింగ్‌కు కేరళ హైకోర్టు అనుమతి

శబరిమలలో ఐదేళ్ల తర్వాత పంబలో వాహనాల పార్కింగ్‌కు కేరళ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శబరిమల పంబ మరియు పరిసర ప్రాంతాలలో అయ్యప్ప భక్తుల వాహనాల పార్కింగ్‌పై విధించిన నిషేధాన్ని కేరళ హైకోర్టు తొలగించింది. నేటి నుంచి వాహనాల పార్కింగ్‌కు అనుమతి లభించింది. 2018లో కేరళలో సంభవించిన వరదల వల్ల పంబ నదీ తీరాలు దెబ్బతిన్నాయి మరియు వాహనాల పార్కింగ్ స్థలం ఇసుకతో నిండిపోయింది. దీనికారణంగా పంబలో వాహనాల పార్కింగ్‌పై హైకోర్టు నిషేధం విధించింది. ఇప్పటివరకు ఉన్న విధానం: పంబకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిలక్కల్‌లో వాహనాలు పార్క్ చేసేవారు, అక్కడి నుంచి కేరళ ప్రభుత్వ రవాణా సంస్థ బస్సుల ద్వారా భక్తులు శబరిమలకు చేరుకునేవారు. దీనివల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత అనుమతి: తిరువాంకూర్ దేవస్వం బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు ఈ అనుమతిని ఇచ్చింది. ఫాస్ట్‌ట్యాగ్ సౌకర్యం కలిగిన, 4 నుండి 7 సీట్లు ఉన్న చిన్న మరియు (లైట్) కార్లను మాత్రమే పంబ పార్కింగ్‌లో నిలిపేందుకు అనుమతించారు. భారీ వాహనాలు కాకుండా ఈ అనుమతి వర్తిస్తుంది. 14 కంటే ఎక్కువ సీట్లు ఉన్న వాహనాలను ఎప్పటిలాగే నిలక్కల్‌లోనే పార్క్ చేయాల్సి ఉంటుంది.

రక్షించాల్సిన పోలీసులే.. భక్షిస్తుంటే ఎలా?



గుంటూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అప్పిరెడ్డిపై అక్రమ కేసు దుర్మార్గమైన చర్య అంటూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వెంగళాయపాలెం బ్యాలెట్ బాక్స్ మాయం చేయాలని అధికారులు చూశారు. అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు మాయం చేయడాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డుకున్నారు. న్యాయం కోసం ధర్నా చేస్తున్న అప్పిరెడ్డి సహా వైఎస్సార్‌సీపీ నేతలపై లాఠీచార్జ్ చేశారు" అని అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. "బ్యాలెట్ బాక్స్‌లు తీసుకెళ్లే అధికారి డెకాయిట్టా..? ధర్నా చేసినవారా?. పోలీసులు రక్షణలో టీడీపీ నేతలు, అధికారులు దౌర్జన్యం చేస్తున్నారు. లేళ్ల అప్పిరెడ్డి మీద టీడీపీ నేతలు చాలా కక్షపెట్టుకున్నారు. అన్యాయాలను అడ్డుకుంటే అక్రమ కేసులు పెడుతున్నారు. లేళ్ల అప్పిరెడ్డి అక్రమ అరెస్టును ప్రజాస్వామ్య వాదులు ఖండించాలి. దోపిడీ చేస్తున్నవారికి రక్షణ, దోపిడీ అడ్డకుంటే శిక్షా?. రక్షించాల్సిన పోలీసులే.. భక్షిస్తుంటే ఏం చేయాలి?. రాష్ట్రంలో ప్రజలే ఆయుధాలు పట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుంది." అని అంబటి వ్యాఖ్యానించారు.

పెట్రోలు బాంబులు వేస్తున్నా పోలీసులు అడ్డుకోవడం లేదు. టీడీపీ నేతలు, అధికారులు, పోలీసులు కలిసిపోయారు. న్యాయబద్ధంగా పోలింగ్ జరగడం లేదని.. ప్రజలు కూడా ఓటు వేయడానికి రావడం లేదు. ఏలేశ్వరంలో సైకిల్ గుర్తు మీద గుద్దిన బ్యాలెట్‌లను అధికారులే కలిపేశారు. బ్యాలెట్ బాక్స్ ఏమైనా కూరగాయల బుట్ట అనుకుంటున్నారా?. బ్యాలెట్ బాక్స్‌తీసుకెళ్లడానికి పీవో ఎవరు?. బ్యాలెట్ బాక్స్ దొంగతనం చేసిన పీవోను సస్పెండ్ చేయాలి" అని లేళ్ల అప్పిరెడ్డి డిమాండ్ చేశారు.

పరిషత్ ఎన్నికల్లోనూ అరాచక పర్వం!

- పెట్రోల్ బాంబులు.. రిగ్గింగ్.. దాడులు.. నిర్బంధాలు
- పోలీసుల అండతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారంటూ వైసీపీ ఆగ్రహం



అమరావతి: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు పరిషత్ ఎన్నికల్లోనూ పునరావృతమయ్యాయి. పెట్రోల్ బాంబుల దాడులు, దొంగ ఓట్లు, రిగ్గింగ్, ప్రత్యర్థి పార్టీ నాయకుల నిర్బంధాలు.. ఇలా పలు ప్రాంతాల్లో ఎన్నికల వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ముఖ్యంగా రాయలసీమలోని పులివెందుల, రైల్వేకోడూరు, చంద్రగిరి నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పోలీసుల సమక్షంలోనే అధికార పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతు న్నారంటూ వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడు తున్నారు.

ఓటు వేయడానికి వెళ్లినా ఓటు లేదట...

జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలం గుండ్లకుంటలో మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి, ఆయన సతీమణి ఇందిరకు ఓట్లు లేవని అధికారులు చెప్పడం వివాదానికి దారితీసింది. మాజీ మంత్రి స్వగ్రామంలోనే ఈ పరిస్థితి ఎదురుకావడం చర్చనీయాంశమైంది. ఓటు వేయడానికి వెళ్లిన తమకు ఓటు లేదని చెప్పడంపై ఇందిర అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చెప్పినట్లు అధికారులు వ్యవహరి స్తున్నారంటూ మండిపడ్డారు. జమ్మలమడుగు మున్సిపాలి టీలో ఓటు లేదనే కారణంతో చైర్‌పర్సన్ అభ్యర్థిగా నామి నేషన్ వేయించలేదని, జనరల్ ఏజెంట్‌గా కూడా అనుమ తించలేదని ఆమె గుర్తుచేశారు. ఇప్పుడు సొంత గ్రామంలో నూ ఓటు లేదని చెప్పడంపై తహశీల్దార్‌ను నిలదీశారు.

దొంగ ఓట్లపై చెవిరెడ్డి ఆగ్రహం

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోనూ ఎన్నికల అక్రమాల ఆరోపణలు తెరపైకి వచ్చాయి. తిరుపతి రూరల్ పరిధిలోని సాయినగర్‌లో టీడీపీ కార్యకర్తలు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వారిని పట్టుకున్నారు. ఈ వ్యవహారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని లింగాల జెడ్పీటీసీ పరిధిలో రిగ్గింగ్ జరుగుతోందన్న సమాచారం వైసీపీ శ్రేణుల్లో కలకలం రేపింది. ఈ నేపథ్యంలో అక్కడికి వెళుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ అడ్డుకోవడం మరో వివాదానికి కారణమైంది. పులివెందులలో ఓటు ఉన్న ఎంపీ బయటకు వెళ్లకూడ దంటూ డీఎస్పీ అభ్యంతరం వ్యక్తం చేయడంపై అవినాష్‌రెడ్డి నిలదీశారు. రిగ్గింగ్‌కు పాల్పడుతున్న టీడీపీ నాయకులకు స్థానికంగా ఓట్లు ఉన్నాయా? అని ప్రశ్నించారు. మరోవైపు పులివెందుల రూరల్ పరిధిలోని ఎర్రిపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు పెట్రోల్ బాంబులు విసిరి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పులివెందుల మండల పరిధిలో 19 సీసీ కెమెరాలు ఉండగా, కేవలం ఐదు మాత్రమే ఆన్‌లైన్‌లో పనిచేస్తున్నాయని, మిగిలినవి ఆఫ్‌లైన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కీలకమైన ఎన్నికల సమయంలో నిఘా వ్యవస్థ పనితీరుపైనా అనుమానాలు వ్యక్తమవు తున్నాయి.


పోలీసుల ఎదుటే పెట్రోల్ బాంబుల దాడులు

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు, పెనగలూరు మండలాల్లో పెట్రోల్ బాంబులు విసిరి విధ్వంసం సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతున్నా అడ్డుకోవడం లేదని వైసీపీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. పోలీసు యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని మండిపడుతున్నాయి. పుట్టపర్తి జిల్లాలో వైసీపీ నాయకులపై పోలీసుల దాడులకు నిరసనగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆందోళనకు దిగారు. పోలీసుల తీరును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు.

ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో ఉండాలా.. పోలీస్ స్టేషన్లలోనా?

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వైసీపీ నాయకులను గృహనిర్బంధం చేయడం, అరెస్టులు చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. వైసీపీ పోలింగ్ ఏజెంట్లను కేంద్రాల్లోకి అనుమతించకుండా పోలీస్ స్టేషన్లకు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లను దూరంగా ఉంచి రిగ్గింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారంటూ వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిషత్ ఎన్నికల్లో ఒక్క జెడ్పీ చైర్మన్ స్థానం కూడా వైసీపీకి దక్కకూడదనే లక్ష్యంతో అధికార పక్షం వ్యవహరిస్తోందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ శ్రేణులు దాడులు, బెదిరింపులు, రిగ్గింగ్‌కు పాల్పడుతున్నాయని విమర్శిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎదురైన పరిణామాలే ఇప్పుడు పరిషత్ ఎన్నికల్లోనూ కనిపిస్తున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికలు అంటే ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసి తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ. కానీ పెట్రోల్ బాంబులు, దాడులు, నిర్బంధాలు, దొంగ ఓట్ల ఆరోపణల మధ్య ఓటరు స్వేచ్ఛ ప్రశ్నార్థకంగా మారితే ప్రజాస్వామ్యానికి అర్థమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం, పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో.. అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

తుపాన్ల వల్ల కోస్తా రైతులు తరచు నష్టపోతున్నారు



కాకుమాను: తుపాన్ల వల్ల కోస్తా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం.. ఏరియల్ సర్వే నిర్వహించారు. బాపట్ల, గుంటూరు జిల్లాల పర్యటనకు వెళ్తున్న సమయంలో హెలికాప్టర్ ద్వారా పంట నష్టాన్ని పరిశీలించారు. హెలికాప్టర్‌లో సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో దిగి.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు చేరుకున్నారు. మురసు తుపానుకు గండ్లు పడిన డ్రెయిన్‌ను పరిశీలించి.. నీటిపారుదలశాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చేరుకుని దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. డ్రెయిన్లకు గండ్లు పడిన కారణంగా నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. "తుపాను కారణంగా గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను వల్ల నష్టం తగ్గించేందుకు ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. పంటల బీమా కట్టాలని ప్రతి రైతును కోరుతున్నాం. మొన్నటి వరకు ఎల్‌నినోతో ఇబ్బందులు.. ఇప్పుడు తుపాన్లు దెబ్బతీశాయి. వరుసగా రెండు తుపాన్లు రావడం చరిత్రలో మొదటి సారి" అని సీఎం అన్నారు.

కురుపాం గురుకులంలో విద్యార్థినులకు అస్వస్థత



కురుపాం గ్రామీణం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. తొలుత నలుగురైదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు చూపించే ప్రయత్నం చేశారని, లోపలికి వెళ్లి చూడగా చాలా మంది విద్యార్థినులు ఒకే గదిలో ఉండి వైద్యం పొందుతున్నారని వారి తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థినులకు జ్వరం, తలనొప్పి, విరేచనాలు, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతున్నారన్నారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాకుండా మాదలంగి పీహెచ్సీకి ఎందుకు తరలిస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం 80 మందికి పైగా విద్యార్థినులు వైద్యం పొందుతున్నట్లు సమాచారం. కురుపాం గురుకుల పాఠశాల వద్ద విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ పిల్లలను తమకు చూపించాలని పాఠశాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనారోగ్యంగా ఉన్న పిల్లలను తమకు చూపించకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిషత్ ఎన్నికల్లో 70.02శాతం పోలింగ్



అమరావతి: ఏపీలో నిన్న జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 70.02శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగ్గా.. తుది పోలింగ్ శాతాన్ని ఎస్ఈసీ ప్రకటించింది. విశాఖ జిల్లాలో నాలుగు జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. అత్యధికంగా 82.51శాతం, అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 62.01 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 65.51, అనకాపల్లి 75.58, అనంతపురం 64.38, అన్నమయ్య 69.19, చిత్తూరు 76.30, బాపట్ల 67.47, కృష్ణా జిల్లా 73.21, కోనసీమ జిల్లాలో 66.33 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పాల ధరల పెంపు.. 35 శాతం పెరిగిన బస్సు ఛార్జీలు!

ఢిల్లీ : కర్ణాటకలో ఇటీవల పాల ధరల పెంపు నిర్ణయం వెలువడిన కొంత సమయానికే రవాణా రంగంపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచుతూ అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబర్ 5 నుంచి ఈ కొత్త ఛార్జీలు అధికారికంగా అమల్లోకి వచ్చాయి. రాష్ట్రంలోని రోడ్డు రవాణా సంస్థల పరిధిలో ప్రయాణ రుసుములు 35 శాతం వరకు పెరగడం ప్రయాణికులను నిరాశకు గురిచేస్తోంది. కాగా, ఇటీవల సాధారణ టోన్డ్ పాలు ధర ఇదివరకు లీటరుకు రూ.46 ఉండగా రూ.54కి పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత మూడేళ్ల కాలంలో బస్సు ఛార్జీలు పెరగడం ఇది రెండోసారి. ప్రస్తుత సవరణ ప్రకారం.. కర్ణాటక స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్ఆర్టీసీ) బస్సుల్లో సగటున 23 శాతం వరకు ఛార్జీలు పెరగగా, బెంగళూరు నగర రవాణా సంస్థ (బీఎంటీసీ) సిటీ బస్సుల్లో ఈ పెరుగుదల ఏకంగా 33 నుంచి 35 శాతం వరకు ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నప్పటికీ రవాణా శాఖ వర్గాలు మాత్రం సంస్థల మనుగడ కోసం ఈ నిర్ణయం తప్పనిసరి అని స్పష్టం చేస్తున్నాయి. డీజిల్ ధరలు విపరీతంగా పెరగడం, నిర్వహణ వ్యయం భారంగా మారడంతో ఆర్టీసీ సంస్థలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని అధికారులు వెల్లడించారు. 'ఆర్టీసీ సంస్థలను లాభాల ఆర్జన కోసం కాకుండా వాటిని కాపాడుకోవడానికి మాత్రమే ఈ ఛార్జీల పెంపు చేపట్టాం' అని ప్రభుత్వ వర్గాలు సమర్థించుకుంటున్నాయి.

బీఎంటీసీ సిటీ బస్సుల్లో ప్రయాణించే వారికి మెజెస్టిక్ నుంచి శివాజీనగర్ వెళ్లేందుకు గతంలో రూ.12 ఉండగా, అది ఇప్పుడు రూ.18కి చేరింది. అలాగే మెజెస్టిక్ - యశ్వంత్‌పూర్ రూట్ ఛార్జీ రూ.18 నుంచి రూ.25కి పెరిగింది. వజ్ర ఏసీ బస్సుల గరిష్ట ఛార్జీని రూ.75 నుంచి రూ.90కి, ఎయిర్‌పోర్ట్ 'వాయు వజ్ర' సర్వీసుల గరిష్ట ఛార్జీని రూ.405 నుంచి రూ.425కి సవరించారు. కేఎస్ఆర్టీసీ సర్వీసుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే సాధారణ, రాజహంస బస్సుల ఛార్జీలు కూడా దూరానికి అనుగుణంగా పెరిగాయి. బెంగళూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అదనపు భారం తప్పడం లేదు. అయితే, మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించే 'శక్తి' పథకం కింద నాన్-లగ్జరీ బస్సుల్లో కొనసాగుతున్న ఉచిత సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఉచిత ప్రయాణ పథకం వల్ల రవాణా సంస్థలపై పడుతున్న ఆర్థిక భారాన్ని పూడ్చుకునేందుకే మిగతా ప్రయాణికులపై ఛార్జీల భారం మోపుతున్నారనే విమర్శలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతు న్నాయి. మరోవైపు నిత్యావసరాలు, పాలు, రవాణా ఛార్జీలు అన్నీ ఒకేసారి పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు బడ్జెట్ ఎలా సర్దు బాటు చేసుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రజా రవాణా వ్యవస్థను నడిపించే ప్రభుత్వాలు ప్రయాణికులపై ఈ స్థాయిలో భారం మోపడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

పంజాబ్‌లో ఘోర రైలు ప్రమాదం

చండీగఢ్ : పంజాబ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. శుక్రవారం సారాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో కర్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో అగ్నిప్రమాదం జరిగింది. కర్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్ 12508లో అగ్ని ప్రమాదం చోటు చేసుకొని నాలుగు బోగీలు అగ్నికి ఆహుతయ్యాయి. ఐదో కోచ్‌లో ఇంజిన్‌కి సైతం మంటలు అంటుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు ట్రైన్ చైన్ లాగి ప్రాణాలు రక్షించుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటలు వేగంగా వ్యాపించడంతో ఇతర బోగీలకు మంటలు అంటుకున్నాయి. ఆ బోగీల్లో ఉన్న పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంతో అప్రమత్తమైన రైల్వే పోలీసులు, స్థానికులు క్షతగాత్రుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు. కాగా, రైల్వే పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. అమృత్‌సర్ నుంచి న్యూ జాల్‌పాయ్‌గురి రాకపోకలు నిర్వహించే ఈ ట్రైన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు అనుమాలు వ్యక్తమవు తున్నాయి. అయినప్పటికీ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.


ప్రభుత్వ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటే మేలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగులపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ''ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై కాంట్రాక్ట్ పద్ధతిలోనే రావాలి. అప్పుడే వారు బాధ్యతగా వ్యవహరిస్తారు''అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది.

ఇందులో ఒక పిటిషన్ పంజాబ్ ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, డీఆర్ బకాయిల చెల్లింపులకు సంబంధించినది. ఈ కేసులో హైకోర్టు పంజాబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏ.పీ సిన్హాపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ బకాయిలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన మరో ఆదేశాన్ని సవాలు చేస్తూ ఇంకో రెండు పిటిషన్లు కూడా సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. మూడింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు పంజాబ్ ప్రధాన కార్యదర్శి సహా పలువురు అధికారులపై క్రిమినల్ ధిక్కార చర్యలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ కేసు విచారణను నిలిపివేస్తూ తీర్పునిచ్చింది. ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత హాజరుపై ఇచ్చిన హైకోర్టు ఆదేశాలనూ కొట్టివేసింది. పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. ''ప్రభుత్వ ఉద్యోగులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తేనే వారికి నిజమైన బాధ్యత ఉంటుంది''అని వ్యాఖ్యానించింది.

ప్రస్తుతం పంజాబ్‌లో ఉన్న ప్రభుత్వం దాదాపు రూ.13,000 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా పొందిందని రాష్ట్రం తరపు న్యాయవాది బెంచ్ దృష్టికి తీసుకురాగా.. వచ్చే ఏడాది మార్చిలోగా ఎంత మొత్తం విడుదల చేయగలరో తెలపాలని కోరింది. ''మీకు కొంత వెసలుబాటు ఇస్తున్నాం. సానుకూలంగా స్పందించండి''అని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను డిసెంబరు ఒకటవ తేదీకి వాయిదా వేసింది. ఆగస్టు మూడవ తేదీన హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

ఇలా మొదలైంది... పంజాబ్ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన కరవు భత్యం (డీఏ) బకాయిల వివాదం ఈ ఏడాది ఏప్రిల్‌లో పంజాబ్-హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కీలక మలుపు తిరిగింది. డీఏ బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం సూచించిన ప్రణాళికను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ తిరస్కరించింది. జూన్ 30లోపు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు వర్తించే రేట్ల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలన్నీ విడుదల చేయాలని ఆదేశించింది. పంజాబ్ ప్రభుత్వం, పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ఆదేశాలను డివిజన్ బెంచ్ ముందు సవాలు చేశాయి. డివిజన్ బెంచ్ ఆగస్టు 3న ప్రభుత్వం అప్పీళ్లను కొట్టివేసింది. రెండు వారాల్లో బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. అంతేకాకుండా, బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు పత్రికలు, సోషల్ మీడియా వంటి మాధ్యమాల్లో భారీ ప్రకటనలపై ఖర్చులు చేయవద్దని కూడా స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు అమలు కాలేదని ఉద్యోగులు, పెన్షనర్లు కొందరు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు అక్టోబర్ 12న, ప్రధాన కార్యదర్శి కేఏపీ సిన్హాకు నోటీసు జారీ చేసింది. క్రిమినల్ ధిక్కరణ చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో చెప్పాలని, వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే సివిల్ ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు క్రిమినల్ కాంటెంప్ట్ చర్యలు ప్రారంభించడం సరికాదని వాదించారు.



ఆ అడుగులకు తొమ్మిదేళ్లు..

రాజకీయ చరిత్రకు ఆనవాళ్లు!

- ఇడుపులపాయలో మొదలై.. ఇచ్ఛాపురంలో ముగిసిన ప్రజా ప్రస్థానం
- 341 రోజుల నడక.. 3,648 కిలోమీటర్ల ప్రయాణం.. 13 జిల్లాలు.. 134 నియోజకవర్గాలు
- కాళ్లకు బొబ్బలు.. ప్రజలతో మమేకం.. సమస్యలే ఎజెండాగా సాగిన ప్రజాసంకల్ప యాత్ర

ఒక్కో అడుగు.. ఒక్కో ఊరు.. ఒక్కో సమస్య.. అలా సాగిన ఆ సుదీర్ఘ ప్రయాణానికి నేటితో తొమ్మిదేళ్లు! రాజకీయ లక్ష్యంతో మొదలైన అడుగులు ప్రజల మధ్యకు చేరాయి. పల్లెల్లో పర్యటిస్తూ.. ప్రజల కష్టాలను వింటూ.. వారి వినతులను స్వీకరిస్తూ సాగిన ఆ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసింది. ఇడుపులపాయలో మొదలైన ప్రస్థానం.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగిసింది. 341 రోజుల పాటు సాగిన నడక.. 3,648 కిలోమీటర్ల ప్రయాణం.. లక్షలాది మంది ప్రజలతో ముఖాముఖి.. ఇదీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర. 2017 నవంబర్ 6న ప్రారంభమైన ఈ యాత్ర.. 2019 జనవరి 9న ముగిసింది. మండుటెండలు, వర్షాలు, అలసటను లెక్కచేయకుండా సాగిన ఈ పాదయాత్ర అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఒక ఎత్తయితే.. ఆ ప్రయాణం పార్టీ రాజకీయ భవిష్యత్తుకు ఎలాంటి బాటలు వేసిందన్నది మరో కీలక అంశం. తొమ్మిదేళ్ల తర్వాత ఆ యాత్ర జ్ఞాపకాలు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి.

ఇడుపులపాయలో తొలి అడుగు.. ప్రజల మధ్యకు జగన్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం 2017 నవంబర్ 6న ఇడుపులపాయలో జగన్ ప్రజాసంకల్ప యాత్రకు శ్రీకారం చుట్టారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవడం, వివిధ వర్గాల ప్రజలతో నేరుగా మాట్లాడటం, వారి ఆకాంక్షలను తెలుసుకోవడం లక్ష్యంగా యాత్రను ప్రారంభించారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, నిరుద్యోగులు, వివిధ సామాజిక వర్గాల ప్రజలను కలుస్తూ ముందుకు సాగారు. గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వినతులు అందించారు. స్థానిక సమస్యల నుంచి రాష్ట్రస్థాయి అంశాల వరకు అనేక విషయాలు ఈ యాత్రలో ప్రస్తావనకు వచ్చాయి.

341 రోజుల నడక.. 3,648 కిలోమీటర్ల ప్రస్థానం

ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా జగన్ 341 రోజుల పాటు పాదయాత్ర సాగించారు. మొత్తం 3,648 కిలోమీటర్ల దూరం నడిచారు. 13 జిల్లాలు, 134 అసెంబ్లీ నియోజకవర్గాలు, 2,516 గ్రామాల మీదుగా ఈ యాత్ర కొనసాగింది. వైఎస్సార్‌సీపీ వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు రెండు కోట్ల మందిని కలిశారు. 124 బహిరంగ సభలు, 55 ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ప్రతి ప్రాంతంలోనూ స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలతో మమేకమవుతూ యాత్రను కొనసాగించారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. యాత్ర సాగిన కొద్దీ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరగడంతో పాటు, ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమంగా దీనికి ప్రత్యేక గుర్తింపు లభించింది.

ఉత్తరాంధ్రలో రాజకీయ సందడి.. ఇచ్ఛాపురంలో ముగింపు

రాష్ట్రంలోని వివిధ జిల్లాల మీదుగా సాగిన ప్రజాసంకల్ప యాత్ర ఉత్తరాంధ్రకు చేరుకున్నప్పుడు రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో యాత్ర ముగింపు కావడం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది. 2019 జనవరి 9న ఇచ్ఛాపురంలో ప్రజాసంకల్ప యాత్ర ముగిసింది. యాత్ర ముగింపునకు గుర్తుగా విజయ సంకల్ప స్తూపాన్ని ఆవిష్కరించారు. ఇడుపులపాయలో మొదలైన అడుగులు ఇచ్ఛాపురం వరకు చేరడంతో శ్రీకాకుళం జిల్లా ఈ రాజకీయ ప్రస్థానంలో కీలక మైలురాయిగా నిలిచింది.

పాదయాత్ర నుంచి అధికార పీఠం వరకు!

ప్రజాసంకల్ప యాత్ర వైఎస్సార్‌సీపీ రాజకీయ ప్రస్థానంలో కీలక ఘట్టంగా నిలిచింది. యాత్ర ముగిసిన కొన్ని నెలలకే 2019 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ప్రజాసంకల్ప యాత్రను కేవలం పాదయాత్రగా కాకుండా.. పార్టీ ఎన్నికల విజయానికి రాజకీయంగా కీలకమైన ప్రస్థానంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభివర్ణించాయి. ప్రజలతో నేరుగా మమేకం కావడం, వారి సమస్యలను వినడం, రాజకీయ సందేశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ఈ యాత్ర ప్రత్యేకతలుగా నిలిచాయి. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలు, పాలనలో తీసుకున్న నిర్ణయాలు, అనంతర రాజకీయ పరిణామాలు కూడా ఈ ప్రస్థానంపై జరిగే విశ్లేషణలో భాగమయ్యాయి.

తొమ్మిదేళ్ల తర్వాత.. మళ్లీ తెరపైకి ఆనాటి జ్ఞాపకాలు

ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభమై తొమ్మిదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆనాటి ఘట్టాలను గుర్తుచేసుకుంటున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు యాత్రలో పాల్గొన్న అనుభవాలను నెమరువేసుకుంటున్నారు. ఒక రాజకీయ నాయకుడి పాదయాత్ర ప్రజలతో సంబంధాలను ఎంతగా ప్రభావితం చేయగలదు? క్షేత్రస్థాయి సమస్యలను రాజకీయ అజెండాగా ఎలా మార్చగలదు? ఎన్నికల విజయానికి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఎంతవరకు దోహదపడతాయి? అన్న అంశాలపై మరోసారి చర్చ జరుగుతోంది. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు సాగిన ఆ ప్రయాణం వైఎస్సార్‌సీపీ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా మిగిలిపోయింది. తొమ్మిదేళ్లు గడిచినా ఆ అడుగుల జ్ఞాపకాలు మాత్రం రాజకీయ చర్చల్లో అప్పుడప్పుడు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. 341 రోజుల నడక.. 3,648 కిలోమీటర్ల ప్రస్థానం.. ఎన్నో మలుపులు.. మరెన్నో రాజకీయ పరిణామాలు! ఇడుపులపాయలో మొదలైన ఆ అడుగులు ఇచ్ఛాపురంలో ముగిసినా.. రాష్ట్ర రాజకీయాలపై వాటి ప్రభావం మాత్రం ఒక చరిత్రగా మిగిలింది.

- సత్తెనపల్లి న్యూస్



పెట్టుబడుల పరుగులు.. ఉద్యోగాల కుదింపు!

ఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు తీస్తోందని గణాంకాలు ఘోషిస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతున్నారు. జీడీపీ వృద్ధి రేటు పెరుగుతోందని పాలకులు గర్వంగా చెబుతున్నారు. కానీ ఈ అభివృద్ధి పరుగుల్లో దేశ యువతకు దక్కుతున్న ఫలితం ఏమిటి? పెట్టుబడులు పెరుగుతున్నా ఉద్యోగాలు ఎందుకు పెరగడం లేదు? పరిశ్రమలు విస్తరిస్తున్నా నిరుద్యోగం ఎందుకు వెంటాడుతోంది? దేశ సంపద పెరుగుతున్నప్పుడు సామాన్యుడి జీవన ప్రమాణాలు ఎందుకు అదే స్థాయిలో మెరుగుపడటం లేదు? ఇవి పాలకులు సమాధానం చెప్పాల్సిన కీలక ప్రశ్నలు.

ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడుల స్వరూపం, వాటి వల్ల కలిగే ఉపాధి అవకాశాల మధ్య సంబంధాన్ని పరిశీలిస్తే అసలు సమస్య అర్థమవుతుంది. పరిశ్రమలు యంత్రాలు, భవనాలు, పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చేసే వ్యయం స్థిర పెట్టుబడిగా పరిగణిస్తే, కార్మికుల వేతనాలు, మానవ వనరుల వినియోగానికి చేసే వ్యయం చర పెట్టుబడి పరిధిలోకి వస్తుంది. నేటి పారిశ్రామిక విధానాల్లో యాంత్రీకరణకు పెరుగుతున్న ప్రాధాన్యం కారణంగా స్థిర పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. తక్కువ మంది కార్మికులతో ఎక్కువ ఉత్పత్తి సాధించడమే పెట్టుబడిదారుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ఫలితంగా పెట్టుబడుల విలువ పెరుగుతున్నా వాటికి అనుగుణంగా ఉద్యోగాల సంఖ్య పెరగడం లేదు. పెట్టుబడుల పెరుగుదలను మాత్రమే ఆర్థిక ప్రగతికి కొలమానంగా చూపించడం వల్ల ఉపాధి రంగంలో నెలకొన్న వాస్తవ పరిస్థితి మరుగున పడుతోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గతిశక్తి కార్యక్రమం ద్వారా రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, జలమార్గాలు, గిడ్డంగులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. రవాణా వ్యయాన్ని తగ్గించడం, సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, పరిశ్రమల పోటీతత్వాన్ని పెంచడం ఈ పెట్టుబడుల ప్రధాన ఉద్దేశాలు. దేశ అభివృద్ధికి ఇవన్నీ అవసరమే. అయితే మౌలిక వసతుల నిర్మాణానికి వేల కోట్లు ఖర్చు చేసినంత మాత్రాన నిరంతరంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఏర్పడతాయనుకోవడం పొరపాటే. నిర్మాణ దశలో కొంతమందికి ఉపాధి లభించినా, ఆ తర్వాత నిర్వహణలో ఆటోమేషన్, ఆధునిక యంత్రాల వినియోగం పెరిగితే మానవ వనరుల అవసరం తగ్గిపోతుంది. కాబట్టి మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు ఉపాధి కల్పించే తయారీ, వ్యవసాయ అనుబంధ, చిన్నతరహా పరిశ్రమల విస్తరణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

ఇప్పటికే ఈ పరిస్థితికి కృత్రిమ మేధ, ఆటోమేషన్ మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఒకప్పుడు వందల మంది నిర్వహించిన పనులను ఇప్పుడు కొద్దిమంది సాంకేతిక నిపుణులు, ఆధునిక యంత్రాల సాయంతో పూర్తి చేస్తున్నారు. బ్యాంకింగ్, ఐటీ, తయారీ, రవాణా, సేవా రంగాల్లో ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొన్ని సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగవుతుండగా, కొత్త నైపుణ్యాలు కలిగిన వారికి మాత్రమే అవకాశాలు లభిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదు. కానీ దాని ప్రభావంతో ఉపాధి కోల్పోయే వారికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. యువతకు కొత్త నైపుణ్యాలు నేర్పించడం, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాలను విస్తరించడం అత్యవసరం. లేకపోతే సాంకేతిక విప్లవం దేశ ఉత్పాదకతను పెంచినా నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రతరం చేసే ప్రమాదం ఉంది.

దేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న యువతలో విద్య, శిక్షణ, ఉపాధి ఏదీ పొందని వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. 2021 సర్వే ఆధారంగా ప్రస్తావించిన గణాంకాల ప్రకారం సుమారు 8.7 కోట్ల మంది ఈ వర్గంలో ఉన్నట్లు పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. నాణ్యమైన వేతన ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు స్వయం ఉపాధి, అసంఘటిత రంగాలపై ఆధారపడుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో తక్కువ ఆదాయంతో జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి దుర్భరంగా ఉంది. ఉద్యోగం లభించకపోవడం ఒక సమస్య అయితే, చదువుకున్న యువత తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు పొందలేకపోవడం మరో సమస్య. ఉన్నత విద్యను అభ్యసించినా సరైన ఉపాధి దొరకక పోటీ పరీక్షల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్న యువత సంఖ్య తక్కువేమీ కాదు. నిరుద్యోగం వల్ల ఆర్థిక సమస్యల తోపాటు సామాజిక, మానసిక ఒత్తిళ్లు కూడా పెరుగుతున్నాయి.

ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా ఎదుగుతున్నప్పటికీ ఆర్థిక వృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా అన్నది కీలకం. కొద్దిమంది సంపదలో అపారమైన వృద్ధి సాధిస్తే, మరోవైపు సామాన్య కుటుంబాలు పెరుగుతున్న ధరలు, విద్య, వైద్య ఖర్చులతో సతమతమవుతున్నాయి. జీడీపీ పెరుగుదల ఒక్కటే ప్రజల సంక్షేమానికి నిదర్శనం కాదు. ప్రజల కొనుగోలు శక్తి, స్థిరమైన ఆదాయం, నాణ్యమైన ఉద్యోగాలు, సామాజిక భద్రత, జీవన ప్రమాణాలు కూడా అభివృద్ధిలో భాగమే. ప్రపంచ సంతోష సూచికలో భారత్ స్థానం కూడా ఆర్థిక వృద్ధితోపాటు సామాజిక సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. సంపద సృష్టి ఎంత ముఖ్యమో, ఆ సంపద ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం అంతకంటే ముఖ్యం.

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే దేశ యువశక్తిని సమర్థంగా వినియోగించుకోవాలి. ప్రపంచ శ్రామిక శక్తిలో గణనీయమైన వాటా కలిగిన భారత్‌కు యువ జనాభా ఒక గొప్ప ఆర్థిక వనరు. ఆ వనరును నిరుద్యోగంగా వదిలేస్తే జనాభా ప్రయోజనం కాస్తా ఆర్థిక భారంగా మారుతుంది. తయారీ రంగం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, పర్యాటకం, ఆరోగ్యం, విద్య, సేవారంగాల్లో విస్తృతంగా ఉద్యోగాలు సృష్టించే కార్యాచరణ అవసరం. విదేశీ పెట్టుబడులు ఎంత వచ్చాయి? ఎన్ని భారీ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి? అనే లెక్కలతోనే అభివృద్ధిని కొలవడం మానుకోవాలి. ఆ పెట్టుబడుల ద్వారా ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? స్థానిక యువతకు ఎంత ఉపాధి లభించింది? కార్మికుల వేతనాలు ఎంత పెరిగాయి? అనే ప్రశ్నలకు కూడా ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి.

దేశంలో పెట్టుబడులు పెరగడం అభివృద్ధికి అవసరమే. కానీ ఆ పెట్టుబడులు ప్రజలకు ఉపాధి, ఆదాయం, భద్రత కల్పించనప్పుడు వాటి ప్రయోజనం పరిమిత వర్గాలకే చేరుతుంది. అభివృద్ధి అంటే ఆకాశాన్ని తాకే భవనాలు, విస్తరించే రహదారులు, ఆధునిక యంత్రాలు మాత్రమే కాదు. నిరుద్యోగ యువకుడి చేతిలో ఉద్యోగం, కార్మికుడి కుటుంబానికి భద్రమైన జీవితం, రైతుకు గిట్టుబాటు ఆదాయం, సామాన్యుడి ఇంట్లో ఆర్థిక స్థిరత్వం కూడా కావాలి. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టాలన్న సంకల్పం నిజం కావాలంటే ఉపాధి కల్పనను జాతీయ ప్రాధాన్యతగా గుర్తించాలి. పెట్టుబడుల పరిమాణం కంటే వాటి ద్వారా సృష్టించిన ఉద్యోగాలే అభివృద్ధికి అసలైన కొలమానం కావాలి. ఎందుకంటే దేశానికి కావాల్సింది కేవలం పెట్టుబడుల పెరుగుదల కాదు.. యువతకు భరోసా ఇచ్చే ఉద్యోగాల పెరుగుదల!

చెన్నైలో వైభవంగా వివాహ వేడుక

శ్రేయ-ఉజ్వల్‌లను ఆశీర్వదించిన వైయస్ జగన్ దంపతులు



చెన్నై: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన సతీమణి శ్రీమతి వైయస్ భారతితో కలిసి చెన్నైలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. చెన్నైలోని ప్రతిష్ఠాత్మక లీలా ప్యాలెస్ హోటల్‌లో వైయస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహం ఉజ్వల్‌తో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు విచ్చేసిన వైయస్ జగన్ దంపతులు నూతన వధూవరులు శ్రేయ-ఉజ్వల్‌లను ఆశీర్వదించి, హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన దంపతులు సుఖ సంతోషాలతో, ఆనందంగా దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శ్రీమతి వైయస్ విజయమ్మతో పాటు పలువురు రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుక ప్రముఖుల సందడితో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మద్యం షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



పెదకూరపాడు: మండల పరిధిలోని గారపాడు, అమరావతి మండలంలోని లేమల్లె మద్యం దుకాణాల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాకు నిల్వలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.మద్యం దుకాణాలను రాత్రి పది గంటల వరకే నిర్వహించాలని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఎవరైనా అనధికారికంగా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ పీర్ హుస్సేన్‌తో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో ఘనంగా 'బ్రిక్స్' సుస్థిర జీవనశైలి వారోత్సవాలు



పెదకూరపాడు: పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి ఆర్.డబ్ల్యు.ఎస్‌డిఇఇ మేడ శ్రీనివాస కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన విద్యార్థులకు ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల) నిర్వహణ, పాత ఎలక్ట్రానిక్ వస్తువుల సేకరణ డ్రైవ్‌లు మరియు ఈ-వేస్ట్ పునరుపయోగం అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ మరియు సుస్థిర జీవనశైలిపై ప్రతిజ్ఞ చేయించారు. నవంబర్ 1 నుండి 7వ తేదీ వరకు ఈ బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.డబ్ల్యు.ఎస్ ఎ.ఇ త్రిలోక్ రెడ్డి, పీసీ చైర్మన్ జీవి. హనుమంతరావు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోసూరు మండల ప్రజలకు రుణపడి ఉంటా



క్రోసూరు: క్రోసూరు ప్రజలకు రుణపడి ఉంటానని జడ్పిటిసి జనసేన నాయకులు పమిడి పాటి శ్రీనివాసరావు అన్నారు. జడ్పిటిసిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, స్థానిక నియోజకవర్గ నాయకులు కంచేటి సాయి సహకారంతో ఎలక్షన్లో మీ ముందుకు వచ్చాను అని అన్నారు. ప్రతి ఒక్క ఓటరు ఎంతో ఆదరించి తమ అమూల్యమైన ఓటు వేసినందుకు అందరికీ రుణపడి ఉంటానని మండల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని శ్రీను అన్నారు.

13,172 పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేశాం

అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 659 మండలాల పరిధిలోని 13,172 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సమాచారమిచ్చింది. కోర్టు కేసుల కారణంగా కొన్ని పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని తెలిపింది. దీనిప్రకారం 229 మండలాల్లో తొలి దశలోనూ 233, 197 మండలాల్లో తదుపరి రెండు, మూడు దశల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. ఒక మండలంలో ఉన్న మొత్తం గ్రామ పంచాయతీలకు ఒకే రోజు ఎన్నిక నిర్వహించాలని ఇప్పటికే ఎస్ఈసీ నిర్ణయించింది. పోలింగ్ పూర్తయిన రోజే ఓట్లను లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తారు.

బీహార్‌ను తలపించేలా ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికలు

పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు - డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి



సత్తెనపల్లి ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీరు బీహార్‌లో గతంలో కనిపించిన పరిస్థితులను తలపించేలా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై, పోలీసు యంత్రాంగం వ్యవహరించిన తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యే వరకు, పోలింగ్ ముగిసేంతవరకు అనేక ప్రాంతాల్లో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. నకరికల్లు, ముప్పాళ్ళ, రాజుపాలెం మండలాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను చించివేయడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వివరించారు. రాజుపాలెంలో నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండా రోడ్లపై కర్రలు, రాళ్లతో దాడులకు దిగినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ పోలీసు అధికారులు సకాలంలో స్పందించలేదని అన్నారు. ఈ పరిస్థితిపై తాను స్వయంగా ఎస్పీ, డీఎస్పీ, సీఐ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అభ్యర్థులకు రక్షణ కల్పించాలని కోరానని, వాహనం ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ సమయం గడుస్తున్నా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని తెలిపారు. నకరికల్లు మండలంలో సీసీ కెమెరాలు నిలిపివేసి, అధికారుల సమక్షంలోనే నామినేషన్ పత్రాలను చించివేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, అటువంటి ఘటనలకు బాధ్యులుగా పేర్కొంటున్న వారిపై ఇప్పటివరకు కేసులు నమోదు కాలేదని విమర్శించారు. జడ్పీటీసీ అభ్యర్థి భర్తను అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎస్ఐ మఫ్టీలో స్టేషన్‌కు తీసుకెళ్లి బెదిరించి నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియోలు, ఆధారాలను డీఎస్పీకి పంపించి చర్యలు తీసుకోవాలని కోరినా ఇప్పటివరకు స్పందన లేదని అన్నారు. ముప్పాళ్ల మండలంలో పోలీసుల సమక్షంలోనే మహిళా అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను లాక్కొని చించివేసిన ఘటనలు జరిగినట్లు పేర్కొంటూ, మహిళలకు సైతం ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సత్తెనపల్లి పట్టణంలోని 12వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి పెద్దింటి గోవిందమ్మ గారి భర్తను ఎన్నికలకు ముందు రోజు రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు తీసుకెళ్లి మరుసటి రోజు సాయంత్రం 5 గంటలకు విడుదల చేశారని, పోలింగ్ రోజున వారి కుమారుడిని నలుగురు వ్యక్తులు బైక్‌పై తీసుకెళ్లినట్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ ఘటనలో డుమ్ము అలియాస్ తేజ అనే వ్యక్తి ఉన్నట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. రాజుపాలెంలో జడ్పీటీసీ అభ్యర్థి ఎన్నికలకు ముందు రోజు ఎస్ఐ వాహనంలో బూత్ ఏజెంట్ల ఇళ్లకు వెళ్లి వారిని బెదిరించారని, వారి ఏజెంట్ ధ్రువీకరణ పత్రాలను చించివేసిన పరిస్థితులు ఎదురయ్యాయని ఆరోపించారు. మాదల గ్రామంలో బూత్ ఏజెంట్ల నియామక ప్రక్రియను అడ్డుకుంటున్నారనే సమాచారం రావడంతో తాను స్వయంగా అక్కడికి వెళ్లి పార్టీ బూత్ ఏజెంట్ల నియామక పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేసి నియామక ప్రక్రియ పూర్తిచేయించానని తెలిపారు. అయితే ఆ వెంటనే పోలీసులు వచ్చి ప్రివెంటివ్ అరెస్ట్ పేరుతో తనను అక్కడి నుంచి నరసరావుపేటకు తరలించి హౌస్ అరెస్ట్ చేశారని వెల్లడించారు. ప్రివెంటివ్ అరెస్ట్ చేయాలంటే ముందుగా నోటీసులు ఇచ్చి, అందుకు గల కారణాలను తెలియజేయాల్సి ఉంటుందని తాను ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వలేదని విమర్శించారు. ఈ మొత్తం ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తే పోలీసులు వర్సెస్ వైఎస్సార్‌సీపీ అన్నట్లుగా పరిస్థితులు కనిపించాయని, పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని అధికార యంత్రాంగాన్ని రాజకీయ పావులుగా ఉపయోగిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికలు అనేవి ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థులను స్వేచ్ఛగా ఎన్నుకునే ప్రజాస్వామ్య ప్రక్రియ అని, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, బూత్ ఏజెంట్లను బెదిరించడం, అభ్యర్థుల కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్లకు తరలించడం వంటి ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాధించిన గెలుపును ప్రజాస్వామ్య విజయంగా ఎలా పరిగణించగలమని ప్రశ్నించారు. నిజంగా ప్రజల మద్దతుపై నమ్మకం ఉంటే స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలను ఎదుర్కోవాలని, అధికార యంత్రాంగం అండతో ప్రత్యర్థులను అడ్డుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగంపై ఉందని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితులే కొనసాగించాలనుకుంటే ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియకు బదులుగా డీఎస్సీ తరహాలో ఒక జీవో తీసుకొచ్చి తమకు నచ్చిన వారికి పదవులు కేటాయించుకోవచ్చుకదా అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను, ప్రజాస్వామ్య వ్యవస్థలోని స్వేచ్ఛను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించడం రాష్ట్ర భవిష్యత్తుకు మంచిది కాదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో కూడా ఇదే తరహా పరిస్థితులు కొనసాగితే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఎలా నిలుస్తుందని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలిన ఏ అధికారి అయినా చట్టానికి అతీతులు కాదని, సంబంధిత ఆధారాలు, విచారణ ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అడ్డదారుల్లో పదవులు చేపట్టినవారు కూడా తమ బాధ్యతలను, ఎన్నికల ప్రక్రియపై వచ్చిన ఆరోపణలను ప్రజలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో చోటుచేసుకున్నట్లు తాము ఆరోపిస్తున్న ప్రతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధిత అభ్యర్థులకు, కార్యకర్తలకు న్యాయం చేయాలని, పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా నిష్పక్షపాతంగా పనిచేయాలని డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని, రాజ్యాంగం మరియు చట్టం అందరికీ సమానమని, ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయి పార్టీ బాధ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రజల నెత్తిన బాబు అప్పుల బండ

అమరావతి: అప్పులు చేయకుండా సంపద సృష్టించి వైఎస్ జగన్ కన్నా మెరుగ్గా అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తానంటూ మాయమాటలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలందరి నెత్తినా మోయలేని అప్పుల బండ పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి నెత్తిన ఉన్న తలసరి అప్పును చంద్రబాబు 29 నెలల పాలనలోనే భారీగా పెంచేశారు. సగటున ప్రతి ఒక్కరి నెత్తిన అక్షరాలా 2 లక్షల 11 వేల 588 రూపాయల అప్పును రాష్ట్ర ప్రజలకు తన స్వర్ణాంధ్రపాలనలో గిఫ్ట్‌గా ఇచ్చారు. బాబు ఐదేళ్ల పాలన పూర్తయ్యేనాటికి ఇలాగే అప్పులు చేసుకుంటూ పోతే రాష్ట్రంలో ప్రతి ఒక్కరి నెత్తిన అప్పుల భారం రూ.5 లక్షలకు పెంచేస్తారని అధికార యంత్రాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ అప్పులన్నీ మాకేం సంబంధమని ప్రజలనుకుంటే పొరపాటు. ఎందుకంటే ఈ అప్పులను.. పన్నుల రూపంలోను, వివిధ చార్జీలుగా ప్రభుత్వానికి చెల్లిస్తూ ప్రజలే తీర్చాలి. ఇప్పటికే ఖజానాలో కనీస నిల్వ లేకుండా ఏడాదిలో 357 రోజులు అప్పులతో గడిపే స్థితికి ఆర్థిక పరిస్థితిని దిగజార్చారని, ఇలా అయితే భవిష్యత్ అంధకారమేనని కాగ్ మొట్టి కాయలు వేసినా చంద్రబాబులో ఏమార్పు లేదు. చివరికి ఖజానా ను, రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టేసి మరీ అప్పులు చేస్తు న్నారు. మద్యం, గనుల ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పు చేశారు. మద్యం ఆదాయం తాకట్టు పెట్టి ఇప్పటికే రూ.5,900 కోట్లు అప్పుచేసిన చంద్రబాబు ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో జరిగిన కేబినెట్ సమా వేశంలో మరో రూ.11,700 కోట్లు మద్యం ఆదాయం ద్వారా అప్పు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. అంతేగాకుండా పట్టణ స్థానిక సంస్థల ఆస్తులను కూడా ప్రైవేట్ కంపెనీలకు తాకట్టు పెట్టేస్తున్నారు.

చంద్రబాబు వచ్చాక అప్పులు రూ.11,21,416 కోట్లకు.. గత వైఎస్ జగన్ పాలనలో లేని అప్పులను బూచిగా చూపెట్టి తప్పుడు ప్రచారం చేసిన బాబు బృందం, ఎల్లోమ్రీడియా ఇప్పుడు బాబు పాలనలో రాష్ట్ర అప్పులను రూ.11,21,416 కోట్లకు పెంచేసినప్పటికీ.. మా బాబు విజనరీ, వాటర్‌మేన్ అంటూ గొప్పలకు పోతున్నాయి. వైఎస్ జగన్ పాలనలో ఎల్లో మీడియా లేని అప్పులు ఉన్నట్లు ఒకసారి రూ.10 లక్షల కోట్లు, మరోసారి రూ.11 లక్షల కోట్లు, ఇంకోసారి రూ.14 లక్షల కోట్లు.. అంటూ విషప్రచారం చేస్తూ రాష్ట్రం శ్రీలంక అయిపోతోందంటూ గగ్గోలు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు చంద్రబాబు 29 నెలల పాలనలోనే ఆంధ్రప్రదేశ్‌ను అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చేస్తూ రాష్ట్ర అప్పులను రూ.11,21,416 కోట్లకు పెంచేసినా ఎల్లో మీడియాకు కనిపించడం లేదు.. వినిపించడం లేదు. సీఎం చంద్రబాబు 29 నెలల వ్యవధిలోనే బడ్జెట్ బయట, బడ్జెట్ లోపల, రాజధాని పేరుతో ఏకంగా రూ.3,99,498 కోట్లు అప్పు చేసినా ఎల్లోమ్రీడియా కళ్లుండి చూడలేని కబోదిలాగ వ్యవహరించడం గమనార్హం.

29 నెలల్లో బాబు అప్పులు రూ.3,99,498 కోట్లు

29 నెలల పాలనలోనే చంద్రబాబు సర్కారు ఏకంగా బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట రికార్డు స్థాయిలో రూ.3,99,498 కోట్ల అప్పు చేసింది. ఈ నెల 3న రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం ద్వారా విక్రయించి రూ.3 వేలకోట్లు బడ్జెట్ అప్పు చేసింది. దీంతో బడ్జెట్, కార్పొరేషన్లు, రాజధాని పేరుతో చేసిన అప్పులు అక్షరాల రూ.3.99 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో బడ్జెట్ అప్పులే రూ.2,29,537 కోట్లున్నాయి. ప్రభుత్వ గ్యారెంటీలు ఇస్తూ కార్పొరేషన్ల పేరుతో చేసిన అప్పులు రూ.1,22,274 కోట్లకు చేరాయి. ఇక రాజధాని పేరుతో చేసిన అప్పులు రూ.47,687 కోట్లకు చేరాయి. బాబు అధికారంలోకి వచ్చిన రోజు నుంచి అప్పుల మీద అప్పులు చేస్తున్నారు. 29 నెలల పాలనలో ప్రతి నెలా సగటున రూ.13,776 కోట్ల అప్పు చేస్తోంది. రోజుకు సగటున రూ.460 కోట్లు అప్పు చేస్తోంది. అప్పులు ఇంకా ఎక్కువ చేయడం కోసం రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి పెరిగిపోతోందంటూ ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతున్నారు. మరోపక్క వృద్ధిరేటు పెరిగితే ఆ మేరకు సంపద ఎందుకు పెరగడం లేదు.. అంటే ఆ వృద్ధి అంతా చంద్రబాబు అంకెల మాయాజాలం తప్ప మరొకటి కాదని స్పష్టం అవుతోంది. ఇన్ని అప్పులు చేసినా సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు. కొత్తగా ప్రభుత్వరంగంలో ఒక రూపాయి ఆస్తి కూడా సృష్టించకపోగా గత వైఎస్సార్‌సీపీ సర్కారు ప్రభుత్వరంగంలో చేపట్టిన వైద్య కళాశాలలను, పోర్టులను, ఫిషింగ్ హార్బర్లను ప్రైవేట్‌పరం చేస్తోంది.

"మహామంత్రి తిమ్మరుసు" గా

మారూరి లింగారెడ్డి అద్భుత నటన

సత్తెనపల్లిలో ఈ నాటకం వేసి 55 ఏళ్ళు పూర్తయింది

- **మహామంత్రి తిమ్మరుసు వేషం వేసిన శ్రీ మారూరి లింగారెడ్డి (ప్రెస్) గారి 35 వ వర్ధంతి (నవంబరు 3) సందర్భంగా ప్రత్యేక వ్యాసం**
- **సినీతార ఎం.ఆర్.తిలకం నటించిన నాటకం**

పాత గుంటూరు జిల్లా, ప్రస్తుత పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణం కళారంగానికి ఒక మంచి గుర్తింపు, గౌరవము ఉన్న పట్టణాలలో ముందు వరుసలో ఉంటుందనటానికి ఏమాత్రం సందేహం లేదు. ఈ పట్టణంలో సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మక నాటకాలు వేసిన మహా కళాకారులు ఎందరో ఉన్నారు. హిందీ నాటికలు కూడా వేసిన చరిత్ర ఈ పట్టణానికి ఉంది.

ఇక అసలు విషయానికి వస్తే 1971వ సంవత్సరం ఆగష్టు 10వ తేదీన సత్తెనపల్లిలో శ్రీ వేమనార్య కళా సమితి వారు "మహామంత్రి తిమ్మరుసు" పేరుతో ఒక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో రంగస్థల క్యారెక్టరు యాక్టరుగా మంచి అనుభవం ఉన్న శ్రీ బాలాజీ ప్రింటింగ్ ప్రెస్ యజమాని, మా పెద్దన్నయ్య గారైన శ్రీ మారూరి లింగారెడ్డి గారు ప్రధాన తిమ్మరుసు పాత్రను అద్భుతంగా పోషించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఈయన గతంలో "ఖిల్జీ రాజ్య పతనం" అనే నాటికలో సేనాని కపూర్ ఖాన్ గా అనేకసార్లు నటించి మంచి నటునిగా గుర్తింపు పొందారు. అలాగే పత్రి జగన్నాధరావు గారు రచించిన "భక్త ఫీరోజ" నాటకంలో జమీందారు పాత్రను వేశారు. ఇలా మంచినటునిగా పేరు తెచ్చుకున్న శ్రీ మారూరి లింగారెడ్డి గారు స్థానిక ప్రగతి కళామండలిలో సభ్యునిగా కొనసాగారు. ఈయన 1991 నవంబరు 3వ తేదీన మృతి చెందారు. ఈయన 35 వ వర్ధంతి సందర్భంగా మరియు

"మహామంత్రి తిమ్మరుసు" నాటకం వేసి 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసాన్ని నేను రాయాలని నిర్ణయించాను. ఇక ఈ "మహామంత్రి తిమ్మరుసు" నాటకం గురించి పూర్వాపరాలు....

ముప్పాళ్ళ మండలం, మాదల గ్రామానికి చెందిన రచయిత, దర్శకుడు అయిన శ్రీ జవంగుల వెంకటదాసు గారు " వీర పృథ్వీరాజ్" అనే నాటకాన్ని రచించి కృష్ణాజిల్లా, గుడివాడ సమీపంలోని వల్లభాపురం గ్రామానికి చెందిన శ్రీ సరిపల్లి శివారెడ్డి గారు సత్తెనపల్లిలో ఉంటున్న సమయంలో ఆయనకు ఈ నాటకాన్ని కృతి సమర్పణ సందర్భంగా 1971 ఆగష్టు 10వ తేదీన 'ఆరాల' గారు రాసిన "మహామంత్రి తిమ్మరుసు" నాటకాన్ని సత్తెనపల్లిలో తన దర్శకత్వంలో ప్రదర్శించేందుకు ఏర్పాటు చేశారు.

ఈ నాటకంలో "మహామంత్రి తిమ్మరుసు" పాత్రను శ్రీ



మారూరి లింగారెడ్డి గారు, శ్రీ కృష్ణదేవరాయలు పాత్రను శ్రీ సరిపల్లి శివారెడ్డి గారు, అన్నపూర్ణ పాత్రను అప్పటి సినీతార యం.ఆర్.తిలకం గారు ప్రధాన పాత్రలను పోషించారు.

ఈ నాటకంలో గజపతిగా కె. వెంకట్రావు గారు, వీరేంద్రుడుగా శ్రీ గద్దె భుజంగరావు గారు (సినీ నటి చౌదరి గారి కుమారుడు), అచ్యుతరాయగా ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు (నా స్నేహితుడు) డాక్టర్ దాసరి పార్ధసారధి గారు, రామలింగయ్యగా కె. సత్యనారాయణరెడ్డి గారు, గోవిందయ్యగా కె. వెంకట స్వామిరెడ్డి గారు, తిమ్మనగా శ్రీ యర్రబాటి పిచ్చయ్య నాయుడుగారు , (చాగంటివారిపాలెం) అల్లసాని పెద్దనగా శ్రీ గంటా పున్నయ్య గారు, ధూర్జటిగా శ్రీ యలగాల లక్ష్మయ్య (పిళ్ళె) గారు, రామరాజ భూషణుడుగా శ్రీ గింజుపల్లి ఆంజనేయులు నాయుడు గారు, రామభద్రుడుగా శ్రీ టి. వెంకటేశ్వరరావు గారు, ప్రగడ సరసకవిగా కె. ఆనందరావు గారు, తెనాలి రామలింగడుగా పి. మస్తాన్ రావు గారు, న్యాయాధిపతిగా శ్రీ అంచా వెంకటేశ్వర్లు (అంచా మైక్ సర్వీస్) గారు, భటునిగా శ్రీ జి.వి బ్రహ్మం గారు, వనజగా కుమారి వసంత గారు, నర్తకిగా బేబి మల్లిక గారు నటించారు. నేపథ్యగాయకునిగా శ్రీ యలగాల లక్ష్మయ్య (పిళ్ళె) గారు, లైటిల్స్ సౌండ్ శ్రీ అంచా వెంకటేశ్వర్లు గారు, ఆర్కెష్ట్రా శ్రీ కె. రాజగోపాలం అండ్ పార్టీ, బి.పకీరయ్య (గుంటూరు) లైటింగ్ శ్రీ యం. వెంకయ్య గారు, శ్రీ దాసరి సీతారామయ్య గారు స్టేజి డెరెక్టరుగా పనిచేయగా శ్రీ షేక్ షౌకత్ అలి గారు, శ్రీ షేక్ సైదా గారు, కె. రామారావు (సైకిల్ షాప్) గారు, శ్రీ శిరిగిరి పూర్ణ చంద్రరావులు కార్యనిర్వాహక సభ్యులుగా వ్యవహరించారు, శ్రీ పసుపులేటి సూర్యారావు గారి అధ్వర్యంలో ఆనాటి గ్రామ ఉప సర్పంచ్ శ్రీ పసుపులేటి కోటేశ్వరరావు గారు, శ్రీ అంచా వెంకటేశ్వర్లు గారు, శ్రీ కొత్తమాసు జగన్నాధరావు గారు, శ్రీ బత్తుల ఆంజనేయులు గార్ల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో అప్పటి ఎం.పి. శ్రీ మేడూరి నాగేశ్వరరావు గారు ప్రత్యేక ఆహ్వానితులుగా, సభాధ్యక్షులుగా నాటి ఫిరంగిపురం సమితి అధ్యక్షులు శ్రీ ఒద్దుల కోటిరెడ్డి గారు వ్యవహరించారు.

అద్భుతంగా జరిగిన ఈ నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

వ్యాస రచన : మారూరి పుల్లారెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్, సత్తెనపల్లి - పల్నాడు జిల్లా.
97053 46857

సోషల్ మీడియాలో ఎన్నికల సెగ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపోటముల కంటే ఎన్నికల నిర్వహణ, ప్రజాస్వామ్య విలువలు, ప్రతిపక్షాలను అణచివేయడంపైనే సోషల్ మీడియా వేదికలపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. 'ఎలక్షన్లా.. సెలక్షన్లా?' అంటూ ఆయన సంధించిన ప్రశ్నతో పాటు ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు అవసరమనే అంశం ఆన్‌లైన్ చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అధిక శాతం నెటిజన్లు వైఎస్ జగన్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. చంద్రబాబు కూటుమి ప్రభుత్వ కుయుక్తులను ఎండగడుతున్నారు.

మహా భారతంలో శకుని పాచికలను తనకు అనుకూలంగా మార్చుకున్నట్లుగా రాష్ట్రంలో అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ఎన్నికల ప్రక్రియను చంద్రబాబు ప్రభావితం చేశారని వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో పెద్ద అంశంగా మారింది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ నుంచి పోలింగ్ ఏజెంట్ల నియామకం వరకు అన్ని దశల్లో అక్రమాలు జరిగాయని వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రజలు తమ ప్రతినిధులను స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశాలకు భంగం కలిగిందని విమర్శించారు.

ఈ వ్యాఖ్యలకు సంబంధించిన పోస్టులు, వీడియోలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. జగన్ తన వ్యాఖ్యల్లో యువతను ప్రస్తావించడం కూడా ఆసక్తికరంగా మారింది. యువత ఉద్యోగాలు, ఉపాధి, అభివృద్ధి వంటి అంశాలతో పాటు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణపైనా దృష్టి పెట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉండాలనే అంశం చర్చకు వచ్చింది. తాజా రాజకీయ పరిణామాలపై యువత సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలను వ్యక్తం చేయడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. పరిషత్ ఎన్నికల నేపథ్యంలోనూ ఎన్నికల సంస్కరణల అవసరాన్ని వైఎస్ జగన్ ప్రస్తావించారు.

నామినేషన్ల తిరస్కరణ, అభ్యర్థుల ఉపసంహరణపై ఒత్తిళ్లు, పోలింగ్ ఏజెంట్లకు ఎదురైన ఇబ్బందులు, ఓట్ల లెక్కింపుపై అభ్యంతరాలు వంటి అంశాలను లేవనెత్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించిందా? ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు కల్పించారా? ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలు సామాజిక మాధ్యమాల్లో రాజకీయ చర్చకు దారితీశాయి. ఓట్ల లెక్కల్లో తేడాలపై సామాజిక మాధ్యమాల్లోనూ అధిక శాతం మంది అనుమానాలు వ్యక్తం చేసి, చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలకు, 'పచ్చ' కుట్రలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సంస్కరణలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ ఏజెంట్ల హక్కుల పరిరక్షణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఫిర్యాదులపై తక్షణ స్పందన, రీపోలింగ్ నిర్ణయాల్లో పారదర్శకత, ఓట్ల లెక్కింపుపై స్పష్టమైన మార్గదర్శకాలు వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందనే అభిప్రాయం సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల విశ్వసనీయత, ఎన్నికల సంస్కరణలపై నెటిజన్ల పోస్టులు వైరల్ అవుతున్నాయి.

కరువు సాయం నిల్




అమరావతి: తుపాన్లను అడ్డుకున్నా.. సునామీలకు ఎదురొడ్డినా.. ఆర్టీజీఎస్ ద్వారా తుపాను గమనాన్ని కచ్చితంగా అంచనా వేసి ఆ మేరకు పంట, ప్రాణనష్టాలు జరగకుండా అడ్డుకోగలిగా.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు తరచు చెబుతూనే ఉంటారు. డ్రామాలాడడంలో తనను మించినవారు లేరని చంద్రబాబు నిరూపించుకుంటూనే ఉంటారు. కానీ విపత్తులతో నష్టపోయిన అన్నదాతలకు సాయం చేయడానికి మాత్రం ఆయనకు మనసు రాదు. తుపాన్లు, కరువు కబుర్లతో కాలక్షేపం చేయడం తప్ప ఒక్క రైతుకు కూడా పైసా కరువు సాయం చేయలేదు.

ఖరీఫ్ సీజన్‌లో నమోదైన లోటు వర్షపాతం గుజరాత్‌లో 11 శాతం, తెలంగాణలో 18, మహారాష్ట్రలో 19, హరియాణలో 25, కర్ణాటకలో 30 శాతంగా ఉండగా ఏపీలో మాత్రం ఏకంగా 52.48 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కరువు మండలాలను ప్రకటించడమేగాక బాధిత రైతులను ఆదుకునేందుకు ఉదారంగా ముందుకొచ్చాయి. కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో రైతు ఖాతాలో రూ.2,500 వంతున మొత్తం రూ.1,250 కోట్లు జమచేసింది. ఒక్కో రైతుకు రూ.5 వేలు కరువుసాయం ప్రకటించిన మహారాష్ట్ర ఇందుకోసం రూ.7,500 కోట్లు మంజూరు చేసింది. గుజరాత్‌లో హెక్టార్‌కు రూ.8,500 చొప్పున కరువు సాయం ప్రకటించారు. దీపావళికి ముందుగానే ఈసాయాన్ని అందించేందుకు ఆయా రాష్ట్రాలు ఏర్పాట్లు చేశాయి. మిగిలిన రాష్ట్రాలు కూడా రైతుల్ని ఆదుకునేందుకు రూ.వేలకోట్లు మంజూరు చేస్తున్నాయి. రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించడమేగాక కరువు ప్యాకేజీలు కూడా ప్రకటించి రైతులను ఆదుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ వర్షపాతం కంటే 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైన 14 జిల్లాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించి కరువు సహాయక చర్యలకు ఉపక్రమించింది. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి సబ్సిడీపై కిలో పశుగ్రాసాన్ని రూ.2కే సరఫరా చేయాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లో నవంబర్ 1వ తేదీ నుంచి 150 రోజుల ఉపాధి కల్పిస్తోంది. పశువుల సంరక్షణకు గోశాలలకు ఒక్కో పశువుకు రోజుకు రూ.80 చొప్పున ఆర్థికసాయం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రుణ వసూళ్ల పేరిట రైతులను వేధించవద్దని మహారాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులను ఆదేశించింది.

ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్రబృందాలు పర్యటించి కేంద్రానికి కరువు నివేదికలు పంపాయి. ముఖ్యమంత్రుల సారథ్యంలో బృందాలు వెళ్లి కరువు సాయం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. ఇలా పొరుగు రాష్ట్రాల్లో కరువును అధికారికంగా గుర్తించి సహాయక చర్యలకు కార్యాచరణ రూపొందిస్తుంటే.. ఏపీలో మాత్రం ఇందుకు భిన్నంగా చంద్రబాబు ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి కరువు కబుర్లు చెబుతూ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడింది. కరువు తీవ్రత అధికంగా ఉన్న ఏపీలో మాత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాకంతో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. సీజన్ ఆరంభం నుంచి సమీక్షలకు ఇస్తున్న ప్రాధాన్యత రైతులను ఆదుకునే విషయంలో ఇవ్వడంలేదు. రాష్ట్రంలో ఖరీఫ్‌లో సాధారణం కంటే ఈ ఏడాది దాదాపు 12 లక్షల ఎకరాల్లో సేద్యమే చేయలేదు. 13.15 శాతం మేర వరినాట్లు పడలేదు. గతేడాదితో పోలిస్తే ధాన్యం ఉత్పత్తి 29.7 శాతం, మొక్కజొన్న 61.9, జొన్న 69.2, చిరుధాన్యాల ఉత్పత్తి 37.8 శాతం తగ్గుతాయని లెక్కతేల్చారు. రాష్ట్రంలోని 688 మండలాల్లో 550 మండలాలు కరువు కోరల్లో చిక్కుకున్నాయని తొలుత ప్రకటించిన ప్రభుత్వం.. చివరకు సీజన్ ముగిసిన తర్వాత 388 మండలాలకే పరిమితం చేసింది. తాజాగా మరో 24 మండలాలను ప్రకటించింది. కానీ కరువు సాయం ఊసెత్తడం లేదు. కరువు తీవ్రతను కేంద్రానికి వివరించి ఎన్డీఆర్ఎఫ్ నిధులు రాబట్టాల్సిన ప్రభుత్వం ఆ దిశగా కనీసం ఆలోచించడంలేదు. ఇటీవల పాలనలో పాతికేళ్లు.. అంటూ ప్రధాని మోదీ భజన చేయడానికి ఢిల్లీ వరకు వెళ్లిన చంద్రబాబుగానీ, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులుగానీ కరువు సాయం గురించి మాత్రం ఆయన్ని అడగలేదు. మరోవైపు సీజన్ ముగిసిన తర్వాత మొక్కుబడిగా పంటనష్టం అంచనాలు రూపొందించి ఆ నివేదికను సైతం పక్కన పడేశారు. మరోవైపు ఉచిత పంటల బీమా పథకాన్ని అటకెక్కించి పైసా బీమా పరిహారం కూడా అందకుండా చేసిన ఘనత కూడా చంద్రబాబుదే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 20కి పైగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఒక్క కృష్ణా వరద సాయం తప్ప మరో విపత్తుకు పైసా పరిహారం ఇవ్వలేదు. గతేడాది విరుచుకుపడిన మొంథా తుపాను సాయం నేటికీ జమచేయలేదు. దీంతో కరువు సాయం ఏది బాబూ.. అంటూ టీడీపీ కూటమి పార్టీ నేతలను రైతులు నిలదీస్తున్నారు.

న్యాయ నేత్రం

ప్రామిసరీనోటు



ప్రామిసరి నోటు ను సాధారణంగా ప్రజలు ఎవరికైనా నగదు ను ఇతరులకు ఇచ్చినప్పుడు గుర్తుగా అనగా చేబదులుగా, వడ్డీగా నగదు ఇచ్చినప్పుడు ఈ విధంగా ప్రామిసరీ నోటు ను రాసుకుంటారు. ఎవరైనా x అనే వ్యక్తి y అనే వ్యక్తికి వడ్డీకి నగదు ఇచ్చినప్పుడు ప్రామిసరీ నోటు రాసుకోవటం పరిపాటి . సహజంగా వడ్డీ రైతు వారి కి 50 పైసలుగా వుంటుంది. కుటుంబ ఖర్చులు నిమిత్తం Rs 2/- గా ఉంటుంది. వ్యాపార నిమిత్తం ఐతే Rs 3/- వడ్డీ గా ఉంటుంది. ఇందులో నగదు తీసుకున్న వ్యక్తి కూడా నోటుని స్వదస్తూరిగా రాయవచ్చు, లేదా థర్డ్ పర్సన్ కూడా నోటు రాయవచ్చు . ఇద్దరు వ్యక్తులు సాక్షులు గా సంతకాలు చేయాలి. నగదు తీసుకున్న వ్యక్తి ప్రామిసరి నోటు పై ఉన్న రెవెన్యూ స్టాంపు పై సంతకం గాని, వేలిముద్ర గాని వేయాలి. ప్రామిసరీ నోటు తాలూకు రావాల్సిన నగదు ను ఇచ్చిన రోజు నుండి 3 సంవత్సరాల లోపు వసూలు చేసుకోవచ్చు. నగదు ఇచ్చిన వ్యక్తి వసూలు కోసం ముందుగా ఒక లాయర్ ద్వారా నోటీస్ పంపాలి, అప్పటికీ నగదు తీసుకున్న వ్యక్తి తిరిగి వాపస్ చేయకపోతే కోర్టు ద్వారా నగదు ను వసూలు చేసుకోవచ్చు.

షేక్ జానీ ఖాజావలి, న్యాయవాది, M.Com, LL.B., **9441085206**

ఉల్లం పలుకు :



కన్ను, మిన్ను కానకపోతే అడుగులు
ఇలానే పడతాయి దేనితప్పులేదు
తప్పటడుగులు వేయడం మన తప్పు
మినహా అందుకే ఆచి తూచి
అడుగులేయ్ గుచ్చుకోవు,
నొచ్చుకోవు!'' చెప్పే ప్రబుద్ధుడే!''

- ఉల్లం శేషగిరిరావు అడ్వకేట్,
హైకోర్టు & సామాజిక విశ్లేషకులు.

జీవితపు సరైన పనిముట్లు!

సత్తెనపల్లి ప్రతినిధి : జీవితంలో విజయం సాధించడానికి ఖరీదైన వస్తువులు, గొప్ప హోదాలు, అపారమైన సంపద ఉండాల్సిన అవసరం లేదు. మనిషిలో నిజాయితీ, పనిపట్ల నిబద్ధత, కష్టపడే తత్వం, అనుభవం, ఆత్మవిశ్వాసం ఉంటే సాధారణమైన అవకాశాలతో కూడా అసాధారణమైన ఫలితాలను సాధించవచ్చు.

ఒకరోజు నా ఇంట్లో వంటగది కుళాయి నుంచి నీళ్లు కారడం మొదలైంది. ఎంత ప్రయత్నించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో చివరకు ఒక ప్లంబర్‌ను పిలిచాను. కొద్దిసేపటికి ఒక మధ్యవయస్కుడు పాత టూల్ బ్యాగ్ పట్టుకుని వచ్చాడు. అతని చేతిలో ఉన్న పనిముట్లను చూసి ఆశ్చర్యపోయాను. ఒక రెంచ్ హ్యాండిల్ విరిగిపోయి ఉంది. మరో రంపం కూడా సగం అరిగిపోయి ఉంది. ఆ పనిముట్లతో అతను అసలు పని చేయగలడా అని నాకు అనుమానం కలిగింది. కానీ అతను మాత్రం నా అనుమానాలను పట్టించుకోకుండా ఎంతో ప్రశాంతంగా, ఏకాగ్రతతో తన పని మొదలుపెట్టాడు. తుప్పుపట్టిన పైపును తొలగించి, అవసరమైన మరమ్మతులు చేసి, కేవలం పది నిమిషాల్లోనే సమస్యను పరిష్కరించాడు. ఒక్క నీటి చుక్క కూడా కారకుండా కుళాయిని సరిచేశాడు. అతని పనితనానికి సంతోషించి వంద రూపాయలు ఇవ్వబోతే, అందులో న్యాయంగా తీసుకోవాల్సిన మొత్తమే తీసుకుని మిగిలిన డబ్బును తిరిగి ఇచ్చేశాడు. ఎందుకని అడిగితే చిరునవ్వుతో ఒక గొప్ప మాట చెప్పాడు. "సార్, మనం చేసే ప్రతి పనికి ఒక న్యాయమైన విలువ ఉంటుంది. అవసరానికి మించి ఆశించడం మొదలుపెడితే మనశ్శాంతిని కోల్పోతాం. ఈరోజు ఎక్కువ సంపాదించాననే ఆనందం కంటే, నా పనికి తగిన ప్రతిఫలం తీసుకున్నాననే సంతృప్తి నాకు ముఖ్యం. మనిషికి సంపాదన ఎంత ముఖ్యమో, ఆ సంపాదన వెనుక ఉండే నిజాయితీ కూడా అంతే ముఖ్యం అని చెప్పాడు.

అతని పాత పనిముట్లను చూసి కొత్తవి కొనుక్కోవాలని నేను సలహా ఇచ్చాను. అప్పుడు అతను చెప్పిన మాటలు నా ఆలోచనా విధానాన్నే మార్చేశాయి. "సార్, పనిముట్లు అరిగిపోవడానికే పుట్టాయి. అవి పాతబడినా, విరిగిపోయినా తమ పని చేయడం ఆపవు. మనుషుల జీవితం కూడా అంతే కదా! కష్టాలు ఎదురవుతాయి, గాయాలు తగులుతాయి, అపజయాలు పలకరిస్తాయి. అంతమాత్రాన మనిషి పనికిరానివాడు అయిపోడు. మనలో నైపుణ్యం, పట్టుదల, నేర్చుకోవాలనే తపన ఉంటే ఎన్ని అడ్డంకులు వచ్చినా మన ప్రయాణాన్ని కొనసాగించగలం. ఖరీదైన పెన్ను చేతిలో ఉన్నంత మాత్రాన గొప్పగా రాయలేం సార్, రాయడం తెలిసిన చేతిలో సాధారణమైన పెన్ను కూడా అద్భుతమైన అక్షరాలను సృష్టిస్తుంది. అందుకే గొప్పతనం మన దగ్గర ఉన్న వస్తువుల్లో కాదు, వాటిని ఉపయోగించే మన ఆలోచనల్లో, మన నైపుణ్యంలో ఉంటుంది అని చెప్పాడు.

ఆ రోజు అతను నా ఇంట్లో కేవలం ఒక కుళాయిని మాత్రమే బాగుచేయలేదు, నా ఆలోచనల్లో పేరుకుపోయిన ఎన్నో



అపోహలను కూడా సరిచేశాడు. నిజానికి మన జీవితంలో కూడా ఇలాంటి ఎన్నో సందర్భాలు ఎదురవుతుంటాయి. ఇతరులతో పోల్చుకుంటూ మన దగ్గర ఉన్నవి సరిపోవని బాధపడుతుంటాం. మరింత డబ్బు కావాలని, మరింత హోదా కావాలని, మరింత గుర్తింపు రావాలని నిరంతరం పరుగులు తీస్తుంటాం. ఆ క్రమంలో మన దగ్గర ఇప్పటికే ఉన్న విలువైన సంపదను గుర్తించలేకపోతాం. నిజాయితీగా సంపాదించే అలవాటు, కష్టాన్ని గౌరవించే మనస్తత్వం, ఉన్నదానితో సంతోషంగా ఉండే సంతృప్తి, ఇతరులకు సహాయం చేసే మంచి హృదయం, తప్పుల నుంచి నేర్చుకునే జ్ఞానం, ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కి తగ్గని ఆత్మవిశ్వాసం... ఇవే మనిషి జీవితానికి అసలైన పనిముట్లు. డబ్బు మనకు సౌకర్యాలను కొనివ్వగలదు కానీ మనశ్శాంతిని కొనివ్వలేదు. అధికారం హోదాను ఇవ్వగలదు కానీ గౌరవాన్ని సంపాదించిపెట్టలేదు. ఖరీదైన వస్తువులు మన స్థాయిని చూపించవచ్చు కానీ మన వ్యక్తిత్వాన్ని నిరూపించలేవు. మనిషిని గొప్పవాడిగా నిలబెట్టేది అతని దగ్గర ఉన్న సంపద కాదు, అతను నడిచే మార్గం, మాట్లాడే మాట, చేసే పని, పాటించే విలువలు. గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే పనిముట్లు పాతబడవచ్చు, పరిస్థితులు మారవచ్చు, కాలం పరీక్షించవచ్చు, కానీ మనలోని నిజాయితీ, నైపుణ్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం మాత్రం ఎప్పటికీ అరిగిపోకూడదు.ఎందుకంటే జీవితంలో గొప్ప విజయాలు సాధించడానికి ఖరీదైన పనిముట్ల కంటే, వాటిని సరిగ్గా ఉపయోగించగల తెలివైన చేతులు, మంచి మనసు, స్థిరమైన ఆలోచనలు ఎంతో అవసరం. చివరికి మనిషి సంపాదించాల్సింది కేవలం డబ్బు కాదు... నలుగురి నమ్మకం, మనసులో సంతృప్తి, జీవితంలో గౌరవం. అదే నిజమైన సంపద... అదే జీవితపు సరైన పనిముట్లు!

తుఫాను అనంతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్



క్రోసూరు: తుఫాను విపత్తు అనంతరం సంభవించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ సూచించారు. బుధవారం క్రోసూరు మండలం గుడిపాడు ఆరోగ్య ఉపకేంద్ర కార్యాలయంలో తుఫాను విపత్తు అనంతర వ్యాధులు మరియు జాతీయ ఒత్తిడి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా తుఫాను తర్వాత ప్రబలే జ్వరాలు, విరోచనాలు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, నీటి కలుషిత వ్యాధులు, ఆహార కలుషితం వల్ల వచ్చే అనారోగ్యాలు మరియు కీటక జనిత రోగాల నివారణపై ఆయన అవగాహన కల్పించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, త్రాగునీటిని బాగా మరిగించి లేదా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని కోరారు. దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి సాధారణ లక్షణాలు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం వస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కార్యకర్తను లేదా ఆశా కార్యకర్తను సంప్రదించాలని తెలిపారు. సిబ్బంది అందరూ జ్వరాలు, విరోచనాల సమస్యలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అలాగే మానసిక ఒత్తిడి నివారణపై మాట్లాడుతూ.. ఒత్తిడితో బాధపడేవారిని ఎగతాళి చేయకుండా ధైర్యం చెప్పాలని, ఒక ఆప్యాయమైన పలకరింపు వారి జీవితంలో ఆశాకిరణంలా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ దివ్య జ్యోతి మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేయడం, తగినంత నిద్ర పోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఇతరులతో పోల్చుకోవడం మానుకోవడం వంటి చిన్న చిన్న మార్పులతో ఒత్తిడిని దూరంగా ఉంచుకోవచ్చని తెలిపారు. ఈ సదస్సులో ఆరోగ్య కార్యకర్త దుద్దుల నిర్మల, ఆశా కార్యకర్త శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

చౌట శ్రీనివాసరావుకు వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలి: ఆర్యవైశ్య, వ్యాపార సంఘాల ఏకగ్రీవ తీర్మానం



సత్తెనపల్లి: సత్తెనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని చౌట శ్రీనివాసరావుకు కేటాయించాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులతో కూడిన సాధన కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో చౌట శ్రీనివాసరావుకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం, సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం, సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం, సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం, సత్తెనపల్లి ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ మరియు పట్టణంలోని వివిధ వ్యాపార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని తీర్మాన పత్రంపై సంతకాలు చేశారు. తమ సంఘాల తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఏకగ్రీవ తీర్మాన ప్రతిని రేపు సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణకు సాధన కమిటీ సభ్యులు స్వయంగా వెళ్లి అందజేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తక్షణమే రాజీనామా చేయాలి

ఎన్నికల అక్రమాలు, పోలీసుల పక్షపాతంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్ర విమర్శలు




ఆంధ్రప్రదేశ్: రాష్ట్రంలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా పూర్తిగా విఫలమయ్యారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు, పోలీసుల పక్షపాత వైఖరి, ఎన్నికల ఏజెంట్లకు ఎదురైన ఇబ్బందులు, ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల ప్రకటనలో జరిగినట్లు చెబుతున్న అక్రమాలపై సీపీఐ అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ప్రకటించిన ఓటింగ్ శాతాల్లో 6 నుంచి 7 శాతం వరకు వ్యత్యాసం కనిపించడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన అనంతరం ఓట్ల శాతం ఎలా పెరిగిందో ఎన్నికల కమిషన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, పల్నాడు, కాకినాడ, కర్నూలు, అనంతపురం, నంద్యాల తదితర జిల్లాల్లో ఎన్నికల అక్రమాలు, బూత్ ఏజెంట్లకు ఎదురైన ఇబ్బందులు, పోలీసుల జోక్యంపై వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా విచారించాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన రాజ్యాంగబద్ధమైన సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఎన్నికల అక్రమాలకు పాల్పడిన బాధ్యులైన అధికారులు, పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కు అధికార పార్టీ ఆస్తి కాదు. ప్రజాస్వామ్యం పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేది కాదు! అని ఆయన స్పష్టం చేశారు.

సత్తెనపల్లిలో ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ వద్ద శుక్రవారం ధన్వంతరి జయంతి వేడుకలను నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా అధ్యక్షులు అట్లూరి బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులుఅట్లూరి బాలసుబ్రమణ్యం కు కొత్త రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలను పిల్లుట్ల శ్రీనివాసరావు ముందుండి పర్యవేక్షించి, కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు పిల్లుట్ల సాంబశివరావు, పిల్లుట్ల శివన్నారాయణ, బండారావూరి రామకృష్ణ, పలకలూరి వెంకటేశ్వరరావు, కొమ్మూరి నాగరాజు, పిల్లుట్ల బోసు, పిల్లుట్ల దుర్గారావు, పిల్లుట్ల పవన్, అట్లూరి మల్లి, వెంకట్రావు, కొమ్మూరి శ్రీనివాసరావు, ధరణికోట నాగేశ్వరరావు, ధరణికోట శ్రీనివాసరావు, పులిపిర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు



ఉడుత చేసిన చిన్న సహాయం..

సత్తెనపల్లి ప్రతినిధి : అనగనగా ఒక అందమైన పచ్చని అడవి. ఎటుచూసినా పచ్చని చెట్లు, గలగల పారే సెలయేళ్లు, రంగురంగుల పూలు, పక్షుల కిలకిలరావాలతో ఆ అడవి ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఆ అడవిలో ఎన్నో రకాల జంతువులు నివసించేవి. వాటిలో ఒక చిన్న ఉడుత కూడా ఉండేది. ఆ ఉడుత చాలా సాధారణమైన జీవితం గడిపేది. ప్రతిరోజూ కష్టపడి కొన్ని గింజలు, పండ్లు, చిన్న చిన్న కాయలు సేకరించి తన కోసం దాచుకునేది. దాని దగ్గర పెద్దగా సంపద ఏమీ లేదు. కానీ ఉన్నదానితో సంతోషంగా జీవించడం, ఇతరులకు హాని చేయకుండా ఉండటం దాని స్వభావం.

ఒకరోజు ఉదయం ఆహారం కోసం వెతుకుతూ ఒక చిన్న పక్షి ఆ ఉడుత దగ్గరకు వచ్చింది. అది చాలా నీరసంగా ఉంది. రెక్కల్లో సత్తువ లేదు. కళ్లలో ఆకలి, ముఖంలో ఆందోళన కనిపిస్తున్నాయి. కొన్ని రోజులుగా సరైన ఆహారం దొరకక ఆకలితో అలమటిస్తున్నానని ఆ పక్షి ఉడుతకు చెప్పింది. ఆ మాటలు విన్న ఉడుత మనసు చలించిపోయింది. తన దగ్గరున్న ఆహారాన్ని చూసింది. అవి రోజంతా కష్టపడి సేకరించిన కొద్దిపాటి గింజలు మాత్రమే. వాటిని తాను తింటే తన ఆకలి తీరుతుంది. కానీ ఆకలితో ఉన్న ఆ పక్షికి ఇవ్వకపోతే అది మరింత ఇబ్బంది పడుతుంది. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా తన దగ్గరున్న ఆహారంలో సగం తీసి పక్షికి ఇచ్చింది. ఆ పక్షి కృతజ్ఞతతో ఉడుత వైపు చూసి నీ దగ్గర కూడా చాలా తక్కువ ఆహారం ఉన్నప్పటికీ నాతో పంచుకున్నావు. నీ సహాయాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను అని చెప్పింది.

అప్పుడు ఉడుత చిరునవ్వుతో, "మన దగ్గర ఎంత ఉందన్నది ముఖ్యం కాదు. ఎదుటివారి అవసరాన్ని గుర్తించి మనకు చేతనైనంత సహాయం చేయడమే నిజమైన మంచితనం" అని సమాధానం చెప్పింది. ఈ సంఘటనను సమీపంలోని చెట్టుపై ఉన్న పక్షులు, చెట్ల మధ్య తిరుగుతున్న జంతువులు గమనించాయి. చిన్న ఉడుత చేసిన పనిని చూసి అవి ఆశ్చర్యపోయాయి. ఇంత చిన్న జీవికి ఇంత పెద్ద మనసు ఉందా అని అనుకున్నాయి.

కనువిప్పు

కొన్ని రోజుల తర్వాత ఆ అడవిలో తీవ్రమైన ఎండలు మొదలయ్యాయి. చెరువులు ఎండిపోయాయి. ఆహారం దొరకడం కష్టమైంది. అప్పుడు ఒకరికొకరు సహాయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో చిన్న ఉడుత చేసిన పనిని గుర్తుచేసుకున్న జంతువులన్నీ ఒక్కటయ్యాయి. ఏనుగులు తమకు దొరికిన నీటిని ఇతర జంతువులకు అందించాయి. కోతులు చెట్లపై ఉన్న పండ్లను అందరికీ పంచాయి. పక్షులు ఆహారం దొరికే ప్రాంతాలను మిగతా జంతువులకు తెలియజేశాయి. జింకలు చిన్న జంతువులకు సురక్షితమైన నీటి మార్గాలను చూపించాయి.

ఒక్కొక్కరి చిన్న సహాయం కలిసికట్టుగా మారింది. అడవిలో ఎవరూ ఆకలితో ఉండకూడదని, ఎవరూ ఒంటరిగా బాధపడకూడదని జంతువులన్నీ నిర్ణయించుకున్నాయి.

కొంతకాలానికి ఆ అడవిలో ఒక కొత్త సంప్రదాయం మొదలైంది. ఎవరి దగ్గర ఏది ఉన్నా అవసరంలో ఉన్నవారితో పంచుకోవడం ప్రారంభించారు. ఒక చిన్న ఉడుత చేసిన మంచి పని అడవిలోని ప్రతి జీవిలో మానవత్వం లాంటి గొప్ప గుణాన్ని మేల్కొలిపింది.

ఒకరోజు ఆ అడవిలోని పెద్ద జంతువులన్నీ ఉడుత దగ్గరకు వచ్చి, "నీ దగ్గర బలం లేదు, సంపద లేదు, పెద్ద హోదా లేదు. అయినా నువ్వు చేసిన చిన్న పని మా అందరికీ ఒక గొప్ప పాఠం నేర్పింది. ఈ అడవిని మార్చింది నీ దగ్గరున్న ఆహారం కాదు.. నీ దగ్గరున్న మంచి మనసు" అని ప్రశంసించాయి.

అప్పుడు ఉడుత వినయంగా నవ్వుతూ, "నేను చేసింది చాలా చిన్న సహాయం మాత్రమే. కానీ ఆ చిన్న సహాయం చూసి మీరందరూ మరొకరికి సహాయం చేయాలనుకున్నారు. అదే నాకు నిజమైన ఆనందం" అని చెప్పింది.

ఈ కథ మనకు నేర్పించే గొప్ప జీవిత సత్యం ఏమిటంటే..

సహాయం చేయడానికి కోట్లు ఉండాల్సిన అవసరం లేదు. గొప్ప



హోదా ఉండాల్సిన అవసరం లేదు. మన దగ్గర ఉన్నది కొద్దిగా అయినా, ఎదుటివారి కష్టాన్ని అర్థం చేసుకునే మంచి మనసు ఉంటే చాలు. మనం ఇచ్చే చిన్న సహాయం ఒకరి జీవితంలో పెద్ద వెలుగును నింపవచ్చు. మనం చెప్పే ఒక మంచి మాట ఒకరి బాధను తగ్గించవచ్చు. మనం ఇచ్చే చిన్న ప్రోత్సాహం మరొకరిలో కొత్త ఆశను కలిగించవచ్చు.

ఈ ప్రపంచంలో గొప్పవారిగా గుర్తింపు పొందేది ఎంత సంపాదించామన్న దానివల్ల మాత్రమే కాదు.. మన వల్ల ఎంతమందికి మేలు జరిగిందన్న దానివల్ల కూడా. మనం వెళ్లిపోయిన తర్వాత మన సంపద కంటే మనం చేసిన మంచి పనులే ఎక్కువ కాలం గుర్తుండిపోతాయి.

గుర్తుంచుకోండి.. చిన్న సహాయం ఎప్పుడూ చిన్నది కాదు. చిన్న మనసు మాత్రమే సహాయం చేయడానికి వెనుకాడుతుంది. గొప్ప మనసు ఉన్నవారు తమ దగ్గరున్న కొద్దిపాటినైనా ఇతరుల సంతోషం కోసం పంచుకుంటారు.

కథలోని నీతి: మన దగ్గర ఉన్నది ఎంత అన్నది కాదు.. మనం పంచుకునే మనసు ఎంత పెద్దదన్నదే ముఖ్యం. ఒకరి కోసం మనం చేసే చిన్న మంచి పని, మరెందరికో మంచితనానికి మార్గం చూపించగలదు!

ఆయుర్వేదం వేడి చేస్తుందా?

భారతీయ వైద్యమైన ఆయుర్వేదం ఎన్నో వేల ఏండ్ల నుంచి ఈ దేశంలో వాడుకలో ఉంది. అత్యంత ప్రజాదరణ పొందింది. బ్రిటిష్ వారు మన దేశానికి వచ్చేవరకు ఇదొక ఘనమైన వైద్యం. భారతీయులంతా ఆయుర్వేద మందులు వాడి తమ రోగాలను తగ్గించుకునేవారు. వైద్యులు తాళపత్రాలలో, ఇంటి పెద్దలు దీనిని గృహవైద్యంగా ఉపయోగించేవారు. కానీ బ్రిటిష్ పాలకులు మన దేశానికి అల్లోపతి వైద్యాన్ని తీసుకువచ్చారు. వారి సామ్రాజ్య విస్తరణలో భాగంగా ఇంగ్లిష్ వైద్యాన్ని ప్రజలలోకి తీసుకువచ్చారు. అందుకోసం ఏకంగా పట్టణాలలో మిషనరీ హాస్పిటల్స్‌నే ప్రారంభించారు. వాళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆయుర్వేదానికి ఆదరణ తగ్గకపోవడంతో... రకరకాల కుయుక్తులు పన్నారు. అందులో భాగంగానే.. ఆయుర్వేద మందులు వాడితే వేడి చేస్తాయనే గోబెల్స్ ప్రచారం చేయడం ప్రారంభించారు.

ఆయుర్వేద మందులు వాడితే వేడిచేస్తాయని భావించిన ప్రజలు.. అప్పటినుంచి క్రమంగా ఆయుర్వేద మందుల స్థానంలో అల్లోపతి మందులు వాడటం ప్రారంభించారు. బ్రిటిష్ వాళ్లు ఆ రోజుల్లో ప్రారంభించిన దుష్ప్రచారం ఇప్పటికీ అలానే కొనసాగుతుండటం దురదృష్టకరం. 18వ శతాబ్దం తొలినాళ్లలో ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో అల్లోపతి వైద్యంలో కెమికల్ పొడులు, టించర్లు, వాటికి తాయారు చేసే ద్రావకాలు, చూర్ణాలు లాంటి మందులెన్నో ఇచ్చేవారు. వీళ్లు రసవాదానికి సంబంధించిన పాదరసము, సీసంలాంటి లోహాలను పరిశుభ్ర పరచకుండా చికిత్సలో భాగంగా వాడేవారు. దీనివల్ల విపరీతమైన వేడిచేసి ఒళ్లంతా దద్దుర్లు, మందుల తాలూకు వాసనలు, చెమటలు పట్టడం, కండ్లు తిరగడం, నాడీ తగ్గిపోవడం లాంటి సైడ్ ఎఫెక్ట్‌లు వచ్చేవి. అయితే శాస్త్రీయ స్పృహ పెరిగేకొద్ది వాళ్లు కొత్త సింథటిక్ మందులను వెలుగులోకి తెచ్చారు. వాళ్ల ఔషధాల లోపభూయిష్టమైన అంశాలను అప్పటికే అభివృద్ధి చెందిన ఆయుర్వేద ఔషధాలను కించ పరచాలనే దురుద్దేశంతో తకువ చేయడం మొదలుపెట్టారు. లోపభూయిష్టమైన వాళ్ల ఔషధాల పనితీరును, వేడిచేసే తత్వాన్ని ఆయుర్వేదానికి అంటకట్టారు.

ప్రపంచమంతా రెండు వందల ఏండ్ల క్రితం వరకు అందరూ ఆయుర్వేదమే వాడారు. చరిత్ర కారులు కానీ, ట్రావెలాగ్స్ రాసిన అన్వేషికులైన మార్కోపోలో, అబ్దుల్ రజాక్, అల్ బెరూని ఫాహియన్, హుయాంగ్ సాంగ్, ప్లీని లాంటి యాత్రికులు భారత్ వచ్చినప్పుడు ఆయుర్వేదమే వాడారు. వీళ్లు ఎవరూ పుస్తకాలలో రాయలేదు. 500 ఏండ్ల నుంచి భారతదేశ సుగంధద్రవ్యాల కోసం పశ్చిమ సముద్రాలపై వచ్చిన యూరోపియన్ వర్తకులు



భారతదేశంలో ఆయుర్వేదమే వాడారు. అది అలాగే 18వ శతాబ్దం వరకు నిరాఘాటంగా కొనసాగింది. చివరి మొగల్ చక్రవర్తి భగందర (ఫిస్టులా) చిదమడం వల్ల పెద్ద సర్జరీ చేసినట్లు, బెంగాల్‌పై కప్పం తీసుకునే హక్కును కంపెనీ పాలకులకు అప్ప చెప్పారు. ఇప్పుడు అప్పుడు ఫిస్టులాకు అద్భుత వైద్యం చేసేవాళ్లు ఆయుర్వేద వైద్యులే.

మిరియాలు, యాలకులు, దాల్చిన చెక్క, షాజీరా, జాజికాయ, జాపత్రి, లవంగాలు, పిప్పళ్లు, బిరియాని ఆకులు, మరాఠీ మొగ్గ లాంటి మన సుగంధ ద్రవ్యాల కోసం బంగారం ఇచ్చి ఎగపడ్డారు. మనందరికి తెలిసి ఇవన్నీ వేడిచేసే పదార్థాలే కదా. వీటితో తయారైన బిర్యానీలు లొట్టలేసుకుంటూ తింటాం. ఈ పదార్థాల వల్ల యూరోపియన్ ఆహారం పాడవకుండా ఉంటుంది. దీనివల్ల లాభమే తప్ప నష్టం లేదు. మరి ఇలాంటి సుగంధ ద్రవ్యాలలోని కొన్ని పదార్థాలు ఆయుర్వేద ఔషధాలలో తకువ మోతాదులో వాటడం జరుగుతుంది. శీతాఫలాది చూర్ణం, తలీసాది చూర్ణం, అగస్త్య రసాయనం, పిప్పరి ఆసవం లాంటి ఔషధాలు జలుబు, ఎలర్జీలు, ఆయాసం, తుమ్ములు ఇతరత్రా శ్వాసకోశ వ్యాధులలో వాడతారు. ఇవన్నీ చాలా తీక్షణంగా, అద్భుతంగా పనిచేస్తాయి. ఎక్కువగా వేడిచేసిన దాఖలాలు ఎన్నడూ లేవు. కొండదొరల వైద్యాలు, పసరు వైద్యాలు, వట్టికారం అన్నంతో వెల్లుల్లి ముద్దలు తినిపించే నాటు వైద్యాలు ఆయుర్వేద వైద్యం కాదు. ఆయుర్వేద వైద్యం అంటే చదువుకొని అనుభవం సంపాదించి, శాస్త్రీయ పద్ధతిలో ప్రాక్టీస్ చేసే ఒక అద్భుతమైన వైద్యశాస్త్రం. అనేకానేక దుష్ప్రచారాలు నమ్మడం వల్ల ప్రజలు మంచి ఆయుర్వేద వైద్యాన్ని పొందలేకపోతున్నారు. ఇప్పటికైనా నిజానిజాలు తెలుసుకుంటే మేలు. దీనివల్ల ఇప్పుడు అనుభవిస్తున్న ఎన్నో దీర్ఘకాలిక రోగాలు అత్యంత చౌకగా, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మంచి వైద్యం పొందవచ్చు.

ప్రపంచ దేశాల్లో దుర్భరమవుతున్న వాతావరణ పరిస్థితులు



వాతావరణ మార్పులను ప్రపంచ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించాలని ది లాన్సెట్ నివేదిక సూచించింది. ప్రభుత్వ విధానాల్లో ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం పెరగాలంటే ఈ చర్య అవసరమని పేర్కొంది. 2016 నుంచి 2023 మధ్య అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది మరణించినట్లు నివేదిక వెల్లడించింది. నవంబరులో జరగనున్న కాప్-31 వాతావరణ సదస్సుకు ముందు బ్రిటన్‌కు చెందిన వైద్య పత్రిక ఈ నివేదికను ప్రచురించింది. 30 దేశాలకు చెందిన 146 మంది పరిశోధకులు ప్రపంచ ప్రజల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని విశ్లేషించారు. 2023లో వేడి కారణంగా రికార్డు స్థాయిలో 7.10 లక్షల మంది మరణించగా, వారిలో 70 శాతానికి పైగా మరణాలకు మానవ కార్యకలాపాల వల్ల కలిగిన వాతావరణ మార్పులే కారణమని అంచనా వేశారు. 2015 పారిస్ ఒప్పందం తర్వాత ఎనిమిదేళ్లలో నమోదైన మూడు మిలియన్ల వేడి సంబంధిత మరణాల్లో 68 శాతం వాతావరణ మార్పుల వల్లే సంభవించాయని లాన్సెట్ కౌంట్‌డౌన్ పరిశోధన విభాగం వెల్లడించింది.

దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం..

వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న ఆరోగ్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రతి సంక్షోభం వచ్చినప్పుడు స్పందించడం కాకుండా, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పరిశోధకులు సూచించారు. అధిక ఉష్ణోగ్రతల తీవ్రత, తరచుదనం పెరగడానికి వాతావరణ మార్పులు కారణమవుతున్నాయని సిడ్నీ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుడు వివరించారు. మానవ కార్యకలాపాల వల్ల కలిగిన వేడికి కారణమైన మరణాలను అంచనా వేయడానికి వివిధ దేశాల్లో నమోదైన వేడి సంబంధిత మరణాలను పరిశీలించి, వాతావరణ మార్పులు లేకపోతే సంభవించేవాటిని మినహాయించారు. గతేడాది ప్రపంచ భూభాగంలో సగానికి పైగా ప్రాంతం కనీసం ఒక నెలపాటు తీవ్రమైన కరువును ఎదుర్కొన్నట్లు నివేదిక పేర్కొంది.

ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం..

వాతావరణ మార్పుల ప్రభావం ఆర్థిక వ్యవస్థపైనా తీవ్రంగా పడుతోంది. అధిక వేడి కారణంగా కార్మికుల పని సామర్థ్యం తగ్గడంతో గత మూడేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా ఒక ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లినట్లు పరిశోధకులు తెలిపారు. ఆగ్నేయాసియా దేశాలు తమ స్థూల దేశీయోత్పత్తిలో 3.9 శాతం, ఆఫ్రికా 3.2 శాతం మేర నష్టపోయాయి. ఐరోపాలో ఈ నష్టం 0.2 శాతం కాగా, అమెరికా ఖండాల్లో 1.5 శాతంగా ఉంది. మరోవైపు, 2016 నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థలోని 194 సభ్యదేశాల్లో 56 దేశాలు తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ముందుగానే గుర్తించే ఆరోగ్య, హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరిచాయి. 2025లో స్వచ్ఛమైన ఇంధనంపై పెట్టుబడులు 2.1 ట్రిలియన్ డాలర్లకు చేరాయి. ఇది శిలాజ ఇంధనాలపై పెట్టిన పెట్టుబడులకు రెండింతలు.

శిలాజ ఇంధనాల వాడకం తగ్గాలి..

అయినప్పటికీ ప్రపంచ ఇంధన అవసరాల్లో 80 శాతం ఇప్పటికీ శిలాజ ఇంధనాల నుంచే తీరుతున్నాయి. వీటి వల్ల ఏర్పడే వాయు కాలుష్యంతో ఏటా 27.3 లక్షల మంది మరణిస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2016 నుంచి కనీసం 77 దేశాల్లో శిలాజ ఇంధన కాలుష్యం తగ్గడం వల్ల సుమారు 3.23 లక్షల మరణాలను నివారించగలిగారు. వాతావరణ మార్పులు, ఆరోగ్యంపై పరిశోధనలకు నిధులు 2024లో 31.6 కోట్ల డాలర్లకు చేరాయి. అయితే, ఈ నిధుల్లో 84 శాతం సంపన్న దేశాల పరిశోధకులకే అందుతున్నాయి. వాతావరణ సంబంధిత ఆరోగ్య ముప్పు ఎక్కువగా ఎదుర్కొంటున్నది పేద దేశాలే కావడం గమనార్హం. మరోవైపు, అమెరికా సహా కొన్ని దేశాల నుంచి అవసరమైన సమాచారం అందుబాటులో లేకపోవడం పరిశోధనలకు ఆటంకంగా మారిందని పరిశోధకులు తెలిపారు. అంతర్జాతీయ రాజకీయ అస్థిరత కారణంగా గత రెండేళ్లుగా వాతావరణ మార్పులు, వాటి ఆరోగ్య ప్రభావాలపై దృష్టి తగ్గిందని, నిర్లక్ష్యం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోందని హెచ్చరించారు.

రూ.40 కోట్లు ఇస్తేనే మీ జట్టులో ఉంటాం.. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు టాప్ ప్లేయర్ల షాక్!

ఢిల్లీ: వ్యాపారపరంగా ప్రపంచస్థాయి లీగ్‌లను దాటేస్తూ బీసీసీఐ, ఫ్రాంచైజీలకు కాసుల వర్షం కురిపిస్తున్న ఐపీఎల్‌లో 2028 సీజన్ నుంచి జట్లకు కొత్త తలనొప్పులు ఎదురుకానున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. భారత్‌లో క్రికెట్‌కున్న క్రేజ్, అంతకుమించి ఈ లీగ్‌కు ఉన్న ఆకర్షణ, స్థాయి దృష్ట్యా పలువురు టాప్ క్రికెటర్లు అయా ఫ్రాంచైజీలతో కొనసాగడానికి భారీ మొత్తంలో డిమాండ్ చేస్తుండటమే ఇందుకు కారణం. మెగా వేలానికి (2028లో) ముందు జట్లన్నీ తాము రిటైన్ చేసుకునే నాలుగు లేదా ఐదుగురు ఆటగాళ్ల జాబితాలో ఉన్న కీలక ప్లేయర్లలో కొందరు తమకు రూ. 40 కోట్లిస్తేనే మీ జట్టుతో ఉంటామని ఫ్రాంచైజీలను డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఐపీఎల్ 2025 వేలంలో రిషభ్ పంత్‌కు దక్కిన రూ. 27 కోట్లే ఇప్పటిదాకా లీగ్‌లో అత్యధిక ధర. అయితే సదరు క్రికెటర్లు డిమాండ్ చేస్తున్న భారీ కాంట్రాక్టుల కోర్కెలు తీరాలంటే మాత్రం పలు కీలక అంశాల్లో క్లారిటీ రావాల్సి ఉంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో ఒక టీమ్ పర్స్ వాల్యూ రూ. 120 కోట్లుగా ఉంది. 2028 సీజన్ నుంచి దీనిని రూ. 150 కోట్లకు పెంచుతారని చర్చలు సాగుతున్నాయి. ఇలా చూసుకుంటే ఒక ప్లేయర్‌కు రూ. 40 కోట్లు అనేది ఫ్రాంచైజీలకు కాస్త ఎక్కువే అయినా పర్స్ విలువపరంగా చూస్తే అది వాస్తవరూపం దాల్చే విషయమే.బీసీసీఐ నిబంధనల ప్రకారం పర్స్ వాల్యూ రూ. 120 కోట్లు ఉన్నప్పుడు (ప్రస్తుతం) జట్లు మెగా వేలానికి ముందు తీసుకునే నలుగురు లేదా ఐదుగురు మార్క్యూ ప్లేయర్ల సాలరీ మొత్తం విలువలో రూ. 75 కోట్లకు మించరాదు. ఒకవేళ పర్స్ వాల్యూ పెరిగితే ఈ లెక్క (రూ. 75 కోట్ల పరిమితి) కూడా పెరుగుతుంది కావున ఒక ఆటగాడికి రూ. 40 కోట్లు అనేది జట్లకు పెద్ద విషయం కాదు. కాగా పర్స్ వాల్యూ అంశం ఐపీఎల్ మీడియా రైట్స్‌తోనూ లింక్ అయి ఉన్నందున దీనిపై బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటందనేది ఆసక్తికరం. రిటెన్షన్ రూల్స్, ఫ్రాంచైజీలు ఎంచుకునే ప్లేయర్ల సంఖ్య వంటి వాటిపై ఆధారపడి ఉంది.

2026.. రెండో అత్యంత వేడి సంవత్సరం



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. 2026 ఇప్పటివరకు నమోదైన అత్యంత వేడి సంవత్సరాల్లో రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని యూరోపియన్ యూనియన్ వాతావరణ పర్యవేక్షణ సంస్థ కోపర్నికస్ వెల్లడించింది. 2024 ప్రస్తుత రికార్డుల్లో అత్యంత వేడి సంవత్సరంగా ఉంది. 2026లోనూ ఉష్ణోగ్రతలు అదే స్థాయికి చేరే లేదా దానిని అధిగమించే అవకాశం 20 శాతం వరకు ఉందని కోపర్నికస్ అంచనా వేసింది. ఈ ఏడాది సగటు పారిశ్రామికీకరణకు ముందుకాలం(1850-1900)తో పోలిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం దాదాపు ఖాయమని తెలిపింది. 2026 అక్టోబర్ ప్రపంచ చరిత్రలోనే అత్యంత వేడి అక్టోబర్ నెలగా నమోదైంది.

'ఇడుపు కాయితం' నుంచి సెకండ్ సింగిల్ 'గడప' పాట విడుదల



టాలీవుడ్ కథానాయకుడు ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ - బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్ 'శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత..' పాట ప్రస్తుతం వైరలవుతుండగా తాజాగా సెకండ్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ గడప పాటను విడుదల చేయగా.. పెళ్లైన అనంతరం కొత్త కోడలు ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం అందించగా.. తేజు విజయ పాడారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.

'రామాయణం' దెబ్బకు మరోసారి ట్రోలింగ్ బారిన పడ్డ 'ఆదిపురుష్'.!

నితిశ్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ' మొదటి భాగం ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సినిమా విడుదలైనప్పటి నుంచే బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు సాధిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. సినిమాకు కొన్ని వర్గాల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ఓవరాల్‌గా మేకింగ్ పరంగా, నటీనటుల అంకితభావం పరంగా ఎక్కడా పెద్దగా నెగెటివిటీని ఎదుర్కొనలేదు. ఊహించిన దానికంటే అద్భుతంగా ఉందనే ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రెండేళ్ల క్రితం ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో వచ్చి తీవ్ర విమర్శల పాలైన 'ఆదిపురుష్' సినిమా జ్ఞాపకాలు ఒక్కసారిగా సోషల్ మీడియాలో మళ్లీ తెరపైకి వచ్చాయి. 'రామాయణ' విజయంతో పోల్చి చూస్తున్న నెటిజన్లు, మీమర్స్ గతంలో 'ఆదిపురుష్' చేసిన ప్రయోగాన్ని, దాని పేలవమైన గ్రాఫిక్స్, పాత్రల రూపకల్పనను మరోసారి తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. 2023లో విడుదలైన 'ఆదిపురుష్' బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ కావడమే కాకుండా, విపరీతమైన ట్రోలింగ్‌ను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. రాముడి పాత్రలో ప్రభాస్ గెటప్ సరిగ్గా లేదని, అసలు బాధ్యతారహి తంగా వ్యవహరించారంటూ అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. ఇక దర్శకుడు ఓం రౌత్ తీరుపై ప్రేక్షకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సినిమా ప్రేక్షకులకు, చిత్ర యూనిట్‌కు ఒక పీడకలగా మిగిలిపోయిందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోల్స్ వచ్చాయి.



ఒక్కో సినిమాకు రూ.8 కోట్లు తీసుకుంటున్నానా..

సినిమా ఇండస్ట్రీలో ఒక భారీ విజయం అందుకున్న తర్వాత హీరోలు, హీరోయిన్ల పారితోషికాలపై రకరకాల వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటీనటుల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. తాజాగా 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటి శ్రీనిధి శెట్టి పారితోషికంపై ఇలాంటి ప్రచారమే తెరపైకి వచ్చింది. ఆమె ఒక్కో సినిమాకు రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు తీసుకుంటున్నారంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై స్పందించిన శ్రీనిధి శెట్టి అనలు విషయాన్ని వెల్లడించారు.ఁశ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ పారితోషికం గురించి జరుగుతున్న ప్రచారం ఆశ్చర్యంగా ఉందని ఆమె పేర్కొన్నారు. కేవలం పుకార్ల ఆధారంగా ఇలాంటి వార్తలను నమ్మవద్దని సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునేటప్పుడు పారితోషికానికే ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తనకు నచ్చిన కథ, అందులో తన పాత్రకు ఉన్న ప్రాధాన్యం, సినిమా నాణ్యత వంటి అంశాలనే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటానని వెల్లడించారు.

'కేజీఎఫ్' చిత్రాలతో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వరుసగా ఎక్కువ సినిమాలు చేసుకుంటూ వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, తాను అలా చేయలేదని శ్రీనిధి శెట్టి అభిప్రాయపడింది. డబ్బు సంపాదించడమే లక్ష్యమైతే ఆ సినిమా విజయాన్ని ఆసరాగా



చేసుకుని అనేక ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని పేర్కొంది. మంచి కథలు, తన నటనకు అవకాశం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నది తన ఉద్దేశమని ఆమె చెప్పుకొచ్చింది. సరైన కథ దొరికితే పారితోషికం విషయంలోనూ చర్చలకు సిద్ధంగా ఉంటానని, నటిగా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడమే తనకు ముఖ్యమని స్పష్టం చేసింది. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన శ్రీనిధి శెట్టి మొదట మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. 2016లో 'మిస్ దివా సుప్రానేషనల్' టైటిల్‌ను గెలుచుకుని, అదే ఏడాది అంతర్జాతీయ స్థాయిలో 'మిస్ సుప్రానేషనల్' కిరీటాన్ని అందుకున్నారు. ఆ తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన 'కేజీఎఫ్: చాప్టర్ 1' సినిమాతో నటిగా పరిచయమయ్యారు. ప్రస్తుతం శ్రీనిధి శెట్టి విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నటిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT GUNDEPUDI VARI VEEDHI, D.NO.18-6-12/4, ACHAMPET ROAD, SATTENAPALLI, PALNADU DISTRICT. ARUNDALPETA, 13TH LINE, 3RD CROSS ROAD, D.NO.31-13-1138, GUNTUR, A.P.- 522002. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.